విశాఖపట్టణం
శనివారం 27 జూన్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:154 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# ఆ ముగ్గురూ.. ఎక్కడ..?

## సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో దర్యాప్తు ముమ్మరం

కానిస్టేబుల్స్ అశోక్, నాని, స్నేహితుడు సురేశ్ పాత్ర

డెడ్ మాయం చేయడంలో పూర్తి సహకారం

సీఐ నాగరాజు అరెస్టు కాగానే పరారీలోకి

ఆచూకీ కోసం రంగంలోకి దిగిన పోలీసులు



2

# టాలెంట్‌కు సరిహద్దులు చూడం

ప్రతిభను చూసి పట్టం కడతాం

తెలంగాణ ఐఎఎస్‌లకు కీలక బాధ్యతల పోస్టు పై లోకేశ్

ధాత్రి రెడ్డికి రతన్ టాటా హబ్ బాధ్యతలపై సోషల్ మీడియాలో చర్చ

రాజకీయ అదృశ్య బోర్డర్లను పట్టించోమని లోకేశ్ కౌంటర్ రిప్లై





(అమరావతి - జయజయహే)

రాష్ట్రాలు వేరైనా, రాజకీయాలు ఎల్లలు గీసినా.. నిజమైన ప్రతిభకు ప్రాంతీయ సరిహద్దులు అడ్డుకావనే సరికొత్త చర్చ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గత కొన్ని వారాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ సెంటిమెంట్ , నిజమైన తెలంగాణ బిడ్డ ఎవరు? అనే రాజకీయ లెక్చర్లు, వాదోపవాదాలు జరుగుతున్న తరుణంలో.. దీనికి పూర్తిగా భిన్నమైన, ఆరోగ్యకరమైన ఒక ని ఉదాహరణ వెలుగులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రాజెక్టును ముందుండి నడిపిస్తున్న కీలక వ్యక్తుల నేపథ్యమే ఇందుకు ప్రధాన కారణం. ఈ సరికొత్త చర్చకు ఒక సీనియర్ జర్నలిస్ట్ పెట్టిన ట్వీట్ వేదికైంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు సీఈవోగా వ్యవహరిస్తున్న ఐఏఎస్ అధికారిణి ధాత్రి రెడ్డి పక్కా తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తి. ఆమెతో పాటు ఈ ప్రాజెక్టులో కీలక భూమిక పోషిస్తున్న దీప్తి , ఒకప్పుడు అమెరికాలో ఉంటూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారు. కోసం తీవ్రంగా శ్రమించిన యాక్టివిస్ట్. ఒకప్పుడు మనం.. ఆంధ్రానా అని అదోలా నవ్వుకున్న ఈ ఇద్దరు తెలంగాణ బిడ్డలు, నేడు నవ్యాంధ్ర ప్రగతి చక్రంలో అత్యంత కీలకమైన ఆవిష్కరణల విభాగాన్ని ..మిగతా 2లో



# మార్కెట్లోకి జొన్నగిరి గోల్డ్ బిస్కెట్

ఏపీ మ్యాప్ చిహ్నంతో రూపకల్పన

వ్యాపారులకు బిస్కెట్ అందజేసిన సీఎం

(కర్నూలు - జయజయహే)

కర్నూలు జిల్లా జొన్నగిరిలో ఉత్పత్తి అయిన స్వచ్ఛమైన బంగారం బులియన్ మార్కెట్లోకి వచ్చేసింది. 'జియో మైసూర్' సంస్థ తవ్వకాల్లో వెలికితీసిన ఈ బంగారు బిస్కెట్లు కొనుగోలుదారులకు అందుబాటులోకి వచ్చాయి. కర్నూలు నగరంలోని ప్రసిద్ధ కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న షరాఫ్ బజార్‌లోని జ్యువెలరీ దుకాణాల్లో ఈ జొన్నగిరి బంగారం కనువిందు చేస్తోంది. ఈ నెల 24న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ బంగారు ఉత్పత్తిని లాంఛనంగా ప్రారంభించారు. ఆ ప్రారంభోత్సవ కార్యక్రమంలోనే తొలి బంగారు బిస్కెట్లను ఆయన ఆవిష్కరించారు. కర్నూలు ప్రాంతానికి చెందిన ముగ్గురు ప్రముఖ వ్యాపారస్తులకు సీఎం స్వయంగా ఈ బిస్కెట్లను అందజేశారు. తొలి స్వదేశీ, స్థానిక బంగారు బిస్కెట్లను అందుకోవడంపై స్థానిక జ్యువెలరీ వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జియో మైసూర్ సంస్థ ఈ బిస్కెట్లను అత్యంత ఆకర్షణీయంగా ..మిగతా 2లో

# నెత్తికి విగ్గు.. నత్తి మాటలు..!

కేతన్‌ను అందుకే నాకు నచ్చలేదు

పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదు

ప్రియుడు చేతన్ చంపేద్దామన్నాడు

పోలీసుల విచారణలో సియా గోయల్

విస్తుపోతున్న దర్యాప్తు చేస్తున్న పోలీసులు



ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

పూణే వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ లోహ్‌గఢ్ కోట హత్య కేసులో విచారణ చేస్తున్న కొద్దీ కొత్త కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితుడి కాబోయే భార్య, సియా గోయల్ ఇప్పుడు పోలీసులకు మరో కీలక విషయాన్ని చెప్పింది. ఆమె చెబుతున్న విషయాలు వింటున్న పోలీసు అధికారుల్లు ఆశ్చర్యపోతున్నారు. కేతన్‌కు జుట్టు లేదని, విగ్గు పెట్టుకునే వాడని సియా చెబుతోంది. ఈ విషయం తనకు నచ్చకపోవడంతో..మిగతా 3లో

# ఫ్యాక్టరీల మూత.. ఉద్యోగాల కోత


పోటీని తట్టుకోలేక హ్యాండ్సప్

నాలుగు ప్లాంట్ల మూసివేతకు నిర్ణయం


లక్ష మంది ఉద్యోగుల తొలగింపు

దిగ్గజ కార్ల సంస్థ పోక్స్ వ్యాగన్‌లో సంచలనం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



ప్రపంచ ప్రసిద్ధ కార్ల తయారీ సంస్థ ఫోక్స్‌వ్యాగన్ తన చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అత్యంత కఠినమైన నిర్ణయాల దిశగా అడుగులు వేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో చైనా ఆటోమొబైల్ కంపెనీల నుంచి వస్తున్న పోటీని తట్టుకోలేక జర్మనీలోని నాలుగు ఫ్యాక్టరీలను శాశ్వతంగా మూసివేయాలని భావిస్తోంది. దీనితో పాటు సంస్థలో పనిచేస్తున్న సుమారు లక్ష మంది ఉద్యోగులపై ..మిగతా 3లో



# ఫ్రైడే.. డ్రైడే..!

పక్కాగా అమలు చేయాలి

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

అధికారుల విధిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలి

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు

తాగునీరు, పారిశుద్ధ్యంపై అధికారులతో సమీక్ష

(అమరావతి - జయజయహే)

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యం అని.. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 'ఫ్రైడే - డ్రైడే' పక్కాగా అమలు చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఏపీలో ప్రజారోగ్య పరిరక్షణే అత్యంత ప్రాధాన్యత అంశమని ..మిగతా 2లో

# నమ్మినోళ్లే.. దోచేసారు

అయోధ్య రామ మందిరంలో కానుకుల చోరీ

దొంగిలించిన విరాళాల సొమ్ము సొంత ఖాతాల్లోకి


నగదు పాటుగా విలువైన ఆభరణాలు కూడా

రెండు పద్ధతుల్లోల దోపిడీకి స్కెచ్.. సిఫారసులతో చేరి.. తనిఖీల్లోకి ఇష్టారాజ్యం

సిట్ దర్యాప్తుతో బండారం బట్టబయలు

కార్యవర్గంలో 8 మంది అరెస్టు.. మరికొందరు రాజీనామా

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



హిందువుల అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రమైన అయోధ్య రామమందిరంలో విరాళాలు, భక్తులు సమర్పించిన కానుకల దొంగతనం వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘోర అపచారంపై వెలువడిన ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదిక నేపథ్యంలో కేసు ఊపందుకుంది. ఈ ఆరోపణల ముసుగులో తీవ్ర ఒత్తిడి రావడంతో, రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా ..మిగతా 2లో

## రాష్ట్రానికి భారీ వర్ష సూచన

నాలుగు రోజుల పాటు అలెర్ట్

ద్రోణి ప్రభావంతో సానుకూల వాతావరణం



2

## 30న ఈఏపీసెట్ ఫలితాలు

ఉన్నత విద్యా శాఖ కసరత్తు

2

భారత పౌరురాలిగానే చివరి రోజులు

# గడపాలని..!

మాతృభూమిపై 94 ఏళ్ల వృద్ధురాలు మమకారం

అమెరికా పౌరసత్వం వదులుకుని.. స్వదేశానికి

భారత పౌరసత్వం కల్పించాలని ప్రభుత్వానికి వినతి

బాపట్ల జిల్లా మహాలక్ష్మమ్మ స్ఫూర్తిదాయక యత్నం

2

# టాలెంట్‌కు సరిహద్దులు చూడం



మొదటి పేజీ తరువాయి...

నడిపిస్తున్నారు. రాజకీయం గీసిన అదృశ్య బోర్డర్లను దాటి ప్రతిభ తన దారిని తాను ఎలా వెతుక్కుంటుందో చెప్పడానికి ఇది నిదర్శనంగా నిలిచింది.

**బోర్డర్లు దాటిన ప్రతిభ**

సదరు జర్నలిస్ట్ తన ట్వీట్‌లో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. కొన్ని వారాలుగా తెలంగాణ సెంటిమెంట్ చుట్టూ తిరుగుతున్న ఉపన్యాసాల మధ్య, ఏపీ ప్రభుత్వ ప్రాజెక్టుల్లో ఈ ఇద్దరు తెలంగాణ బిడ్డలు లీడ్ రోల్ పోషిస్తున్నారనే వార్త నాలో ఆనందం నింపింది. ఏపీ ప్రభుత్వం తమ రాష్ట్ర అవసరాలకు ఎలాంటి టాలెంట్ కావాలో చూసింది తప్ప, ఆ టాలెంట్ ఏ ప్రాంతం నుండి వచ్చిందో చూడలేదు. మీ మాతృభూమిపై మీకు గర్వం ఉండొచ్చు, కానీ ఏ రాజకీయ నేత కూడా మీ ప్రతిభను రాష్ట్ర సరిహద్దుల వద్ద ఆపలేరని గుర్తుంచుకోండి" అని సదరు జర్నలిస్ట్ రాసుకొచ్చారు. రాజకీయ ప్రయోజనాల కోసం సెంటిమెంట్‌ను వాడుకునే నేతల అసలు రంగును గుర్తించాలని పిలుపునిచ్చారు.

**మీరు ఏం నిర్మించగలరో చూస్తాం - లోకేశ్**

ఈ వైరల్ ట్వీట్‌పై ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ , మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ అద్భుతమైన రిప్లై ఇచ్చారు. "దీనితో నేను వంద శాతం ఏకీభవిస్తున్నాను. మేము నిర్మిస్తున్న నవ్యాంధ్రప్రదేశ్ సరిగ్గా ఇలాగే ఉంటుంది. భౌగోళిక సరిహద్దుల కంటే ప్రతిభకు మాత్రమే విలువనిచ్చే రాష్ట్రాన్ని మేము తయారుచేస్తున్నాం. మా వద్దకు వచ్చే వారిని మీరు ఎక్కడి నుండి వచ్చారు అని మేము అడగం.. మీరు ఈ రాష్ట్రం కోసం ఏం నిర్మించగలరు? అని మాత్రమే అడుగుతాం. మీ మూలాలను గౌరవించండి, కానీ రాష్ట్ర బోర్డర్లు మీ అవకాశాలను పరిమితం చేయనివ్వకండి. ఆంధ్రప్రదేశ్ అనేది ఎవరు ఎక్కడి నుండి వచ్చారనే దానిపై కాకుండా, అందరం కలిసి ఏం నిర్మిస్తున్నామనే దానిపైనే ఆధారపడి ఉంటుంది" అని లోకేష్ పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల విభజన జరిగి ఇన్నేళ్లవుతున్నా, నేటికీ కొందరు నాయకులు ప్రాంతీయ సెంటిమెంట్లను రగిల్చి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న తరుణంలో.. ఈ ఉదంతం బ్యూరోక్రటిక్, ఐటీ వర్గాల్లో సరికొత్త ఆలోచనకు తెరలేపింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాంతీయ బేధాలు చూడకుండా తెలంగాణకు చెందిన సమర్థులైన అధికారులకు, లీడర్లకు అగ్రతాంబూలం ఇవ్వడం శుభపరిణామం అని నెటిజన్లు కొనియాడుతున్నారు. అభివృద్ధి, ఆవిష్కరణల విషయంలో సంకుచిత రాజకీయ ఆలోచనలను పక్కనబెట్టి, టాలెంట్‌ను మాత్రమే కొలమానంగా తీసుకుంటేనే ఉమ్మడి తెలుగు జాతి ప్రపంచ పటంలో మరింత ఉన్నత స్థానానికి చేరుకుంటుందని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది.






# మార్కెట్లోకి జొన్నగిరి గోల్డ్ బిస్కెట్

మొదటి పేజీ తరువాయి...

తీర్చిదిద్దింది. మార్కెట్లో ఇవి 50 గ్రాములు, 100 గ్రాములు, 500 గ్రాముల బరువుల్లో లభిస్తున్నాయి. ముఖ్యంగా 500 గ్రాముల బిస్కెట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ బిస్కెట్‌పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మ్యాప్‌ను ప్రత్యేకంగా ముద్రించారు. అలాగే 'జొన్నగిరి గోల్డ్ మైన్' అనే పేరుతో పాటు స్వచ్ఛతను తెలిపే '999' నంబర్‌ను కూడా అచ్చు వేశారు. ఇది 24 క్యారెట్ల స్వచ్ఛతను కలిగి ఉంది. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం ఈ 500 గ్రాముల బిస్కెట్ విలువ సుమారు రూ.75 లక్షలకు పైనే ఉంటుంది. స్థానికంగా బంగారం ఉత్పత్తి కావడం మన ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలు చేస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. 'మన దేశంలో బంగారానికి విపరీతమైన డిమాండ్ ఉంది. ఇందుకోసం ఏటా వేల కోట్లు వెచ్చించి విదేశాల నుంచి మనం దిగుమతి చేసుకుంటున్నాం. ఇప్పుడు జొన్నగిరి గనుల ద్వారా స్థానికంగానే బంగారం లభిస్తోంది. దీంతో విదేశీ దిగుమతులపై ఆధారపడటం కొంతమేర తగ్గుతుంది. దీనివల్ల మన విదేశీ మారకద్రవ్యం దేశం దాటి పోదు. అంతిమంగా మన రూపాయి విలువ మరింత బలపడుతుంది' అని వ్యాపారులు అంటున్నారు. ఈ బంగారం స్థానికంగానే ఉత్పత్తి అవుతోంది. అయినప్పటికీ ప్రస్తుతానికి ప్రభుత్వ పరంగా దీనిపై ఎలాంటి పన్ను రాయితీలు లేవు. మార్కెట్లో విదేశీ బంగారానికి ఏ విధమైన పన్నులు వర్తిస్తాయో, దీనికి కూడా అవే వర్తిస్తాయి. కస్టమ్స్ డ్యూటీ, దిగుమతి సుంకం, జీఎస్టీ అన్నీ కలుపుకుని ఈ బిస్కెట్లను విక్రయిస్తున్నారు. నాణ్యతలో మాత్రం ఇది విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బంగారానికి ఏమాత్రం తీసిపోదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

రాయలసీమ ప్రాంతం విలువైన ఖనిజ సంపదకు పెట్టింది పేరు. ఉమ్మడి అనంతపురం జిల్లా వజ్రకరూరులో వజ్రాలు లభిస్తున్నాయి. ఇప్పుడు కర్నూలు జిల్లా జొన్నగిరిలో బంగారం వెలికితీస్తున్నారు. ఈ నేపథ్యంలో కర్నూలులో ఒక స్పెషల్ ఎకనామిక్ జోన్ లేదా 'జ్యువెలరీ క్లస్టర్' ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఊపందుకుంది. ఈ క్లస్టర్ ఏర్పాటైతే వేలాది మంది స్థానిక స్వర్ణకారులకు, కార్మికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుంది.

# ఫ్రైడే.. డ్రైడే..!

మొదటి పేజీ తరువాయి...

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అమరావతిలో తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నియంత్రణ చర్యలపై ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వర్షాకాలం, మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా దోమల నివారణ, అంటువ్యాధుల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన 'ఫ్రైడే - డ్రైడే' కార్యక్రమాన్ని కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పక్కాగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ పారిశుద్ధ్య విధుల్లో పారదర్శకత పెంచేందుకు ప్రతి శుక్రవారం అధికారులు విధిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో మురుగు నిల్వలను తక్షణమే తొలగించేలా శాశ్వత ఏర్పాట్లు చేయాలని, దోమల ఉత్పత్తి కేంద్రాలను నిర్మూలించాలని సూచించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడంతో పాటు క్రమం తప్పకుండా వీధుల పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టడం స్థానిక సంస్థల కనీస బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో ప్రజారోగ్యానికి ఎలాంటి ఢోకా లేకుండా ముందస్తుగా బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలను తగిన మోతాదులో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ, ప్రజలను కూడా ఈ పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని, అప్పుడే సీజనల్ వ్యాధుల రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దగలమని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# నమ్మినోళ్లే.. దోచేసారు

మొదటి పేజీ తరువాయి...

తమ పదవులకు నైతిక కారణాలతో రాజీనామా సమర్పించారు. మే నెల చివరి వారంలో విరాళాల పెట్టెలను ఖాళీ చేయడం, బ్యాంకు డిపాజిట్లను సమీక్షించిన ట్రస్ట్ అధికారులకు మొదటిసారిగా దొంగతనంపై అనుమానం వచ్చింది. సాధారణంగా ఒక్కో పెట్టెలో ఉండే 7 నుండి 8 లక్షల రూపాయలలో, 500 రూపాయల నోట్ల కట్టల సంఖ్య కొన్ని వారాలుగా తగ్గుతూ వచ్చింది. దీంతో అధికారులు నోట్ల లెక్కింపు గదిలో రహస్య కెమెరాలను ఏర్పాటు చేశారు. ఒక వారం పాటు సేకరించిన సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, నోట్లు లెక్కించే కొందరు ఉద్యోగులు కెమెరాలకు అడ్డంగా నిలబడగా, మరో సహచరుడు నోట్ల కట్టల నుండి డబ్బును దొంగిలించి తన దుస్తులలో దాచుకోవడం స్పష్టంగా రికార్డ్ అయింది. నిందితులు విరాళాల పెట్టెల్లో దొరికిన నోట్లను లెక్కించడానికి, నగలను రిజిస్టర్లలో నమోదు చేయడానికి ముందే దొంగతనానికి పాల్పడేవారని తేలింది.

**రెండు పద్ధతుల్లో పక్కా స్కెచ్‌తో దోపిడీ!**

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ ముఠా రెండు రకాలుగా మోసానికి పాల్పడింది. నోట్ల లెక్కింపు సిబ్బంది ప్రతి కట్టకు అదనపు నోట్లను జతచేసేవారు. బ్యాంకులో జమ చేయడానికి డబ్బును గుడి నుండి తీసుకువెళ్ళినప్పుడు, ఆ కట్టలలోని అదనపు నోట్లను విడిగా తీసేసి, కేవలం కట్టల సంఖ్యను మాత్రమే లెక్కించి తప్పుడు వోచర్లు సృష్టించేవారు. ఈ మోసంలో అనుకల్ప్ మిశ్రా పాత్ర ఉండగా, అతని బావమరిది లవ్‌కుష్ మిశ్రా ద్వారా ఈ నెట్‌వర్క్ నడిచింది. పోలీసులు లవ్‌కుష్ మిశ్రా ఇల్లు సోదా చేయగా సుమారు రూ. 10 లక్షల నగదు పట్టుబడింది. నిందితులలో ఒకడైన అవినాష్ పాండే దొంగిలించిన విరాళాల సొమ్మును అదే రోజు తన సొంత బ్యాంకు ఖాతాలో జమ చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాక, భక్తులు రామ్ లల్లాకు సమర్పించిన చెవిపోగులు, ఝుంకీలు, ముక్కుపుడకలు, కంకణాలు, కాలి గజ్జెలు వంటి బంగారు, వెండి ఆభరణాలను కూడా ఈ ముఠా దొంగిలించింది.

**సిఫార్సులతో చేరి.. తనిఖీల్లేక దోచేశారు!**

ఈ నోట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న ఉద్యోగులందరూ ట్రస్ట్‌లోని కీలక వ్యక్తుల సిఫార్సులతో చేరినవారే. చంపత్ రాయ్ డ్రైవర్ రామ్ శంకర్ యాదవ్ అలియాస్ తిను యాదవ్ మేనేజర్‌గా వ్యవహరిస్తూ, తన కజిన్ మనీష్ యాదవ్‌ను ఈ పనిలో పెట్టాడు. విధి నిర్వహణ ముగించుకుని వెళ్లేటప్పుడు ఉద్యోగులను సరైన రీతిలో తనిఖీ చేయకపోవడమే ఈ భారీ చోరీకి కారణమైంది. రోజుకు సుమారు రూ. 6 నుండి 7 లక్షల రూపాయల వరకు దొంగతనం జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

**8 మంది అరెస్ట్!**

ఈ వ్యవహారంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్రంగా స్పందించారు. "అయోధ్య హిందూ విశ్వాసానికి ప్రతీక, ప్రజా విశ్వాసాన్ని దెబ్బతీసే ఇలాంటి ద్రోహులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోం" అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో రంగంలోకి దిగిన సిట్ నివేదిక ఆధారంగా పోలీసులు ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మొహర్రం సెలవు దినం కావడంతో, నిందితులను రిమాండ్ నిమిత్తం డ్యూటీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచనున్నారు.

## భారత పౌరురాలిగానే చివరి రోజులు గడపాలని..!

(బాపట్ల - జయజయహే)

సొంత ఊరు, మాతృభూమిపై ఉండే మమకారం ఎలాంటిదో చాటిచెప్పే హృదయపూర్వక ఘటన ఇది! రెండు దశాబ్దాల క్రితం పొందిన అమెరికా పౌరసత్వాన్ని వదులుకుని, తన చివరి శ్వాస వరకు భారత పౌరురాలిగానే బతకాలన్నది ఆ వృద్ధురాలి కోరిక. ఆమె వయసు 94 ఏళ్లు. ఈ వయసులో మాతృభూమిపై ఉన్న ప్రేమే ఆమెను మళ్లీ భారతదేశానికి రప్పించింది. ఆమే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొండ్రగుంట మహాలక్ష్మమ్మ. తన భర్త మరణించిన తర్వాత మహాలక్ష్మమ్మ అమెరికా వెళ్లారు. అప్పట్లో ఆమె కుమారుడు బుచ్చయ్య చౌదరి వర్జీనియాలోని పీటర్స్‌బర్గ్‌లో ఆంకాలజిస్ట్ (క్యాన్సర్ నిపుణుడు)గా పనిచేసేవారు. ఈ క్రమంలోనే 2000 సంవత్సరంలో మహాలక్ష్మమ్మకు అమెరికా పౌరసత్వం లభించింది. దాదాపు 18 ఏళ్ల పాటు ఆమె అమెరికాలోనే నివసించారు. అయితే, ఆమె కుమారుడు మంగళగిరిలోని ఎన్నారై ఆసుపత్రిలో చేరడంతో, 2018లో వారు తిరిగి భారతదేశానికి వచ్చేశారు. కాగా భారత పౌరసత్వం కోసం మహాలక్ష్మమ్మ అధికారుల చుట్టూ తిరుగుతున్న ఒక వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా చీనగంజాం మండలం చింతగుంపల గ్రామానికి చెందిన ఆమె.. బుధవారం నాడు తన కుమారుడితో కలిసి కలెక్టర్ జె. వెంకట మురళిని కలిశారు. సాధ్యమైనంత త్వరగా తనకు భారత పౌరసత్వం ఇప్పించాలని ఆమె కలెక్టర్‌ను అభ్యర్థించారు. తాను ఇప్పటికే అమెరికా పౌరసత్వాన్ని పూర్తిగా వదులుకున్నానని అధికారులకు స్పష్టం చేశారు. "కలెక్టర్ గారు, నాకు ఇప్పుడు 95 ఏళ్లు వస్తున్నాయి. నా మాతృభూమిలో, ఒక భారతీయ పౌరురాలిగానే నా చివరి రోజులు గడపాలన్నదే నా ఏకైక కోరిక. నా మరణం తర్వాత నా అంత్యక్రియలు కూడా నా సొంత గ్రామంలోనే జరగాలి. అందుకే నేను అమెరికా పౌరసత్వాన్ని వదిలేశాను. దయచేసి నాకు వీలైనంత త్వరగా భారత పౌరసత్వం వచ్చేలా సహాయం చేయండి," అని మహాలక్ష్మమ్మ ఎంతో భావోద్వేగంతో, ఆశతో వేడుకున్నారు. తనకు భారత పౌరసత్వం లభించిన తర్వాత దేశ చట్టాలకు కట్టుబడి ఉంటానని, రాజ్యాంగాన్ని గౌరవిస్తానని ఆ వృద్ధురాలు హామీ ఇచ్చారు. పుట్టిన గడ్డపైనే కన్నుమూసేందుకు అవసరమైన చట్టపరమైన అనుమతులు ఇప్పించాలని స్థానిక అధికారులను కోరారు. దీనిపై బాపట్ల జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. చట్టపరమైన నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఆయన హామీ ఇచ్చారు. స్థానిక విచారణ నివేదికను మొదట రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని, ఆ తర్వాత తుది సిఫార్సును కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని ఆయన వివరించారు.

0





## ఆ ముగ్గురూ.. ఎక్కడ..?

### సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో దర్యాప్తు ముమ్మరం

### కానిస్టేబుల్స్ అశోక్, నాని, స్నేహితుడు సురేశ్ పాత్ర

### డెడ్ మాయం చేయడంలో పూర్తి సహకారం

### సీఐ నాగరాజు అరెస్టు కాగానే పరారీలోకి

### ఆచూకీ కోసం రంగంలోకి దిగిన పోలీసులు

(విజయవాడ - జయజయహే)

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన సాయికృష్ణ లాకప్ డెత్ కేసుకు సంబంధించి రోజు రోజుకూ కీలక విషయాలు బయటకు వస్తున్నాయి. సాయికృష్ణ మృతదేహాన్ని సీఐ నాగరాజుతో కలిసి ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్, సీఐ స్నేహితుడు మాయం చేసినట్లు సిట్ విచారణలో బయటపడింది. సీఐ నాగరాజు అరెస్ట్ తరువాత హెడ్ కానిస్టేబుల్స్ అశోక్, జంగం నాని, స్నేహితుడు సురేష్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. సీఐ పేరు చెప్పుకుంటూ ప్రైవేట్ వ్యవహారాలు నడపడంలో హెడ్ కానిస్టేబుల్ నాని కీలకంగా ఉన్నట్లు సమాచారం. గన్నవరంలో సస్పెండ్ కాగా, పటమట స్టేషన్‌లో అక్రమాలకు పాల్పడ్డారని వచ్చిన అభియోగాల నేపథ్యంలో జంగం నానిని ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపించారు. ఇటీవలే కృష్ణలంకలో హెడ్ కానిస్టేబుల్‌గా నానికి పోస్టింగ్ ఇచ్చారు. సాయికృష్ణ లాకప్ డెత్ తరువాత మృతదేహాన్ని మాయం చేయడంలో సీఐ నాగరాజుతో కలిసి అశోక్, నాని, సురేష్ ముఖ్యపాత్ర పోషించినట్లు విచారణలో సిట్ తేల్చింది. సీడీఆర్, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఆ ముగ్గురూ కీలకంగా ఉన్నట్లు సిట్ గుర్తించింది. దీంతో పరారీలో ఉన్న ముగ్గురి కోసం సిట్ అధికారులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

## రాష్ట్రానికి భారీ వర్ష సూచన

### నాలుగు రోజుల పాటు అలెర్ట్

### ద్రోణి ప్రభావంతో సానుకూల వాతావరణం

(అమరావతి - జయజయహే)

రాష్ట్రంలో ఏర్పడిన వాతావరణ ద్రోణి ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల పాటు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో పిడుగులు పడే ప్రమాదం కూడా ఎక్కువగా ఉందని.... ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ద్రోణి ప్రభావంతో శనివారం(జూన్ 27) ఉత్తరాంధ్ర పరిధిలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, మార్కాపురం, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ జిల్లాలతో పాటు రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో కూడా అక్కడక్కడ చల్లటి గాలులతో కూడిన తేలికపాటి జల్లులు కురుసే సూచనలున్నాయి. ఆదివారం నాటికి వర్షాల ప్రభావం మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే ఛాన్స్ ఉంది. ఈ జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తూ మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. వర్షాలు, ఈదురు గాలులు వచ్చే సమయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. ఉరుములు, మెరుపులు వచ్చేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ చెట్ల కింద, హోర్డింగ్స్ (ప్రకటనల బోర్డులు), పాత గోడల కింద నిలబడకూడదని హెచ్చరించారు. ముఖ్యంగా పొలాల్లో ఉండే రైతులు, పశువులను మేపే కాపరులు పిడుగుల బారిన పడకుండా ఉండటానికి ఉరుములు రాగానే సురక్షితమైన శాశ్వత కట్టడాల లోపలికి వెళ్లాలని సూచించారు. రోడ్లపై తెగిపడిన విద్యుత్ వైర్లు ఉంటే వాటికి దూరంగా ఉండాలని.... వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. నిన్నటి వరకు ఆగ్నేయ మధ్యప్రదేశ్ మరియు దాని పరిసర ప్రాంతాలలో కేంద్రీకృతమై ఉన్న ఉపరితల ఆవర్తనం ఇప్పుడు మరింత బలపడింది. ఇది ప్రస్తుతం ఉత్తర తెలంగాణ , దాని పరిసర ప్రాంతాలపై సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల నుండి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది. ఈ ఆవర్తనం ఎత్తుకు వెళ్లేకొద్దీ దక్షిణ వైపునకు వంగి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వివరించింది. దీని ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై...... పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసేందుకు అనుకూల వాతావరణం ఏర్పడింది.

## 30న ఈఏపీసెట్ ఫలితాలు

(అమరావతి - జయజయహే)

ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ ఫలితాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది విద్యార్థులకు కీలక అప్‌డేట్ వచ్చింది. ఈఏపీసెట్-2026 ఫలితాలను జూన్ 30వ తేదీన విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. ఆ దిశగా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అన్ని రకాల కసరత్తు చేస్తోంది. నిజానికి మొదట ప్రకటించిన అధికారిక షెడ్యూల్ ప్రకారం జూన్ 1వ తేదీనే ఈఏపీసెట్ ఫలితాలను విడుదల చేయాల్సి ఉంది. అయితే..... ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం, వాటి ఫలితాల వెల్లడిలో సమయం పట్టడంతో ఫలితాలు విడుదలకు లైన్ క్లియర్ కాలేదు. ఇటీవలనే ఈ ఫలితాలు విడుదలయ్యాయి. మరోవైపు సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల ప్రక్రియ పూర్తికాకపోవడం మరో ప్రధాన కారణంగా ఉంది. ఈఏపీసెట్ తుది ర్యాంకుల కేటాయింపులో ఇంటర్మీడియట్ మార్కులకు 25 శాతం వెయిటేజీ ఉంటుంది. దీనివల్ల ఇంటర్ మార్కుల నమోదు ప్రక్రియ పూర్తయితేనే ర్యాంకులను ఖరారు చేయడం సాధ్యమవుతుంది. ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు ఇప్పటికే విడుదల కాగా..... ఇప్పుడు సీబీఎస్ఈ మార్కుల ప్రక్రియ తుది దశకు చేరింది. ఇంటర్ మార్కుల వెయిటేజీకి ఎంతో ప్రాధాన్యం ఉన్న నేపథ్యంలో ఈఏపీసెట్ కన్వీనర్ సీబీఎస్ఈ విద్యార్థులకు ఒక ముఖ్యమైన అలర్ట్ జారీ చేశారు. సీబీఎస్ఈ 12వ తరగతి రీవెరిఫికేషన్, రీవాల్యుయేషన్‌లలో మార్కులు పెరిగిన విద్యార్థులు ఎవరైనా ఉంటే..... వారు తమకు మారిన మార్కులతో కూడిన డిక్లరేషన్ ఫామ్‌ను జూన్ 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఈ గడువు ముగిసిన తర్వాత సీబీఎస్ఈ అభ్యర్థుల మార్కుల డేటాను క్రోడీకరించి, తుది ఫలితాలను సిద్ధం చేయడానికి అధికారులకు మరో రెండు రోజుల సమయం పడుతుంది. ఏపీ నుంచి కూడా పలువురు విద్యార్థులు... సీబీఎస్ఈ ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. దాదాపు వీరి సంఖ్య 8 వేల వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆ ఫలితాల ప్రక్రియ ముగిసిన వెంటనే జూన్ 30న లేదా ఆ తర్వాత తేదీలో ఏపీఈఏపీసెట్ ఫలితాలను వెల్లడించే సూచనలున్నాయి.

# నెత్తికి విగ్గు.. నత్తి మాటలు..!

మొదటి పేజీ తరువాయి...

అతడిని పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని పేర్కొంది. ఈ కారణంగానే తాను నిందితుడైన చేతన్‌తో సంబంధం పెట్టుకున్నట్టు వివరించింది. వదిలించుకోవాలనే ఉద్దేశంతోనే కేతన్‌ను హత్య చేయించడానికి కుట్ర పన్నానని సియా తెలిపింది. విచారణ సమయంలో కేతన్‌కు నత్తి కూడా ఉందని, అది కూడా తనకు నచ్చలేదని పోలీసులకు సియా గోయల్ చెప్పింది. కేతన్‌ను ఎందుకు పెళ్లి చేసుకోకూడదో అనే విషయం గురించి ఆమె వద్ద చాలా కారణాలు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు. మొదటిది, ఆమె చేతన్ చౌదరిని ప్రేమించింది. రెండోది, కేతన్‌కు తలపై జుట్టు తక్కువగా ఉంది. మూడవది, కేతన్‌కు నత్తి ఉంది. పెళ్లి కుదిర్చేటప్పుడే సియా కుటుంబానికి ఈ విషయం తెలుసని, కానీ వారు దానిని తేలికగా తీసుకున్నారని అంటున్నారు. కేతన్‌ను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని తన కుటుంబానికి ఎందుకు చెప్పలేదని పోలీసులు సియాను ప్రశ్నించగా, అలా చెప్పి వారిని బాధపెట్టడం ఇష్టం లేదని ఆమె చెప్పింది. దానికి బదులుగా, కేతన్‌ను హత్య చేయడానికి స్కెచ్ వేయడం తనకు సులభమనిపించిందని తెలిపింది. కేతన్‌ను చంపడమే సియా పథకం. అతను ట్రెక్కింగ్ చేస్తుండగా కిందపడి చనిపోతాడు. ఆ ప్రాంతంలో సీసీటీవీ కెమెరాలు లేకపోవడంతో ఈ విషయాన్ని ఎవరూ ప్రశ్నించరు. ఎవరూ ఏమీ అనుమానించరు అని సియా అనుకుంది.

### సియా గోయల్‌ను పట్టించుకోని కుటుంబం

సియా గోయల్‌ను అరెస్టు చేసినప్పటి నుంచి ఆమెను ఎవరూ పరామర్శించలేదని లోనావాలా రూరల్ పోలీస్ వర్గాలు తెలిపాయి. సాధారణంగా కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు పరామర్శిస్తారు, కానీ ఈ కేసులో ఇప్పటివరకు ఎవరూ ఆమెను కలవలేదు. సియా తల్లిదండ్రులు, సోదరుడు ఆమె ఇంట్లోనే ఉన్నారు. ఆ ముగ్గురిలో ఎవరూ సియా గురించి విచారించడానికి పోలీస్ స్టేషన్‌కు రాలేదు. ఈలోగా, చేతన్



తండ్రి మాత్రం కేసు అప్‌డేట్స్ తెలుసుకోవాడనికి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థ నివేదిక ప్రకారం, కేతన్ అగర్వాల్ హత్య కేసులో నిందితులు సియా, ఆమె ప్రియుడు చేతన్ హత్య ఎలా చేశారో అర్థం చేసుకోవడానికి పూణే రూరల్ పోలీసులు లోహ్‌గఢ్ కోటలో నేర దృశ్యాన్ని రీకన్‌స్ట్రక్ట్ చేయనున్నారు. నేరం జరిగిన సమయంలో నిందితుల ఎవరు ఎక్కడ ఉన్నారు? దాడి ఎవరు ఎలా చేశారు. ఎలా కేతన్ లోయలో పడిపోయాడో తెలుసుకునేందుకు డమ్మీ బాడీని ఉపయోగిస్తారు. అన్ని ఆధారాలు పరోక్షమైనవేనని, ప్రతి విషయం తెలుసుకునేందుకు ఇలా చేస్తామని పోలీసులు చెబుతున్నారు.

### సియా గోయల్ సోదరుడి విచారణ

లోనావాలా రూరల్ పోలీసులు సియా గోయల్ సోదరుడిని కూడా విచారిస్తున్నారు. కేతన్‌ను పెళ్లి చేసుకోవడానికి సియా గోయల్ ఎప్పుడైనా అయిష్టత వ్యక్తం చేసిందా? సియా తన కుటుంబానికి ఏం చెప్పింది? అన్ని కోణాల్లోనూ విచారణ జరిపేందుకు సియా సోదరుడిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. సియా గోయల్ తండ్రి ప్రవీణ్ గోయల్ చాలా సీరియస్‌గా స్పందించారు. "ఇది చాలా విషాదకరమైన ఘటన. ఈ రోజుకి కూడా మేము దీన్ని నమ్మలేకపోతున్నాం. వారు తమ కొడుకును కోల్పోయారు, కానీ నేను వారి కంటే ఎక్కువగా కేతన్‌ను ప్రేమించాను. నేను అతనికి ఎంతగానో దగ్గరయ్యాను అంటే, అతన్ని నా సొంత కొడుకుగా భావించడం మొదలుపెట్టాను. ఈ రోజు మనం అంత మంచి అబ్బాయిని కోల్పోయాం, ఆ విషయం మమ్మల్ని తీవ్రంగా బాధిస్తోంది" అని అన్నారు. "ఈ ఘటనలో బాధ ఏమిటంటే, ఇది చేసిన వారికి అత్యంత కఠినమైన శిక్ష విధించాలి. మన కేతన్ కోట నుంచి ఎలాగైతే పడిపోయాడో, ఈ హత్యలో దోషిగా తేలిన వారు, బాధితురాలు నా సొంత కూతురైనా సరే, వారిని కూడా అక్కడి నుంచి తోసివేయాలి."

### ఇంతకంటే విషాదకరమైన ఘటన మరొకటి ఉండదు.

"ఒక తండ్రిగా నేను చెప్పేదేమిటంటే, అగర్వాల్ కుటుంబానికి అండ పోయింది. ఇంతకంటే విషాదకరమైన ఘటన మరొకటి ఉండదు." "వారి పెళ్లిపై మాకు ఎన్నో ఆశలు ఉండేవి. పెళ్లి ప్రతిపాదన జరిగినప్పటి నుంచి సియా ఎప్పుడూ సంతోషంగా ఉండేది. ఆమె, 'కేతన్ చాలా మంచివాడు. నాకు ఇంత అద్భుతమైన అత్తమామలు, ఆడపడుచు ఉన్నారు. నేను చాలా సంతోషంగా ఉన్నాను' అని చెప్పేది." కేతన్ తండ్రిపై వచ్చిన ఆరోపణల గురించి ఆయన మాట్లాడుతూ, "ఆయనకు తెలిసి ఉంటే, మాతో చెప్పి ఉండేవారు; బహుశా మేము ఈ రోజును ఎదుర్కోవలసి వచ్చేది కాదు."

### చేతన్‌తో ప్రేమ వ్యవహారం గురించి..

"మాకు దాని గురించి ఏమాత్రం తెలియదు. సియా ఒక సాధారణ 19 ఏళ్ల అమ్మాయి. 19 ఏళ్ల వయసులో అలాంటి పని ఎలా చేయగలదు? చేతన్ ఎక్కడి నుంచి వచ్చాడో నాకు తెలియదు, నేను అతని ముఖం ఎప్పుడూ చూడలేదు, మాట్లాడలేదు. మేము అతని పేరు కూడా ఎప్పుడూ వినలేదు." "కేతన్ కుటుంబం మంచి, సంస్కారవంతులు. ఈరోజు మేము ఒక కొడుకును, ఒక మంచి కుటుంబాన్ని కోల్పోయాము." అని అన్నారు. ఒకవేళ సియా తన ప్రేమ వ్యవహారం గురించి కేతన్‌కు చెప్పి ఉంటే, ఆమె తన కుటుంబానికి చెప్పి, వారి ద్వారా మాకు తెలియజేయాల్సిందని ఆయన ఇంకా అన్నారు.

# ఎస్ఐఆర్ నమోదులో అప్రమత్తంగా ఉండాలి: గురుమూర్తి రెడ్డి





**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**

రాష్ట్రంలో కొనసాగుతున్న ఎన్నికల ఓటర్ల ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో అప్రమత్తంగా వ్యవహరించాలని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాజమండ్రి పార్లమెంట్ అబ్జర్వర్ గురుమూర్తి రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్సీపీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో వార్డు ఇన్‌చార్జీలు, వార్డు అబ్జర్వర్లు, బూత్ లెవల్ ఏజెంట్లకు ఎస్ఐఆర్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ అబ్జర్వర్ అద్దంకి ముక్తేశ్వరరావు, ఎస్ఐఆర్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పరమేశ్వరరావు పాల్గొని ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై వివరించారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, చిరునామా సవరణలు వంటి అంశాలను ఎన్నికల సంఘం పోర్టల్‌లో ఎపిక్ నంబర్, మొబైల్ నంబర్ ద్వారా పరిశీలించాలని సూచించారు. బూత్ లెవల్ ఏజెంట్లు ఓటర్లకు అవసరమైన ఫారాలు అందించి, వాటిని సక్రమంగా సమర్పించేలా చూడాలని, బీఎల్‌వోలతో నిర్ధారించుకోవాలని తెలిపారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ మాట్లాడుతూ, వార్డు ఇన్‌చార్జీలు, బీఎల్ఏలు బాధ్యతాయుతంగా పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యకర్తలు ఎలాంటి ఒత్తిళ్లకు గురైనా ధైర్యంగా పనిచేయాలని, ఎన్నికల ప్రక్రియలో ప్రతి అర్హ ఓటరికి న్యాయం జరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు, వార్డు బాధ్యులు, బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మండలంలో 28న పల్స్ పోలియో కార్యక్రమం

### గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని తహశీల్దారు ఆదేశం..

**కొయ్యూరు : (జయ జయహే) న్యూస్ జూన్ 27..**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలో 28వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహశీల్దారు కె.ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. పోలియో చుక్కల కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో డప్పు చాటింపు, టాంటా, దండోరా వేయించి విస్తృతంగా ప్రచారం చేయాలని గ్రామ కార్యదర్శులు, గ్రామ కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. 0 నుండి 5 సంవత్సరాల పిల్లలకు తప్పనిసరి, 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు తహశీల్దారు సూచించారు. ఒక్క పిల్లవాడు కూడా మిగిలిపోకూడదని అధికారులు, ప్రజలను కోరారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసి, కొయ్యూరు మండలాన్ని పోలియో లేని మండలంగా తీర్చిద్దేందుకు అందరూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం

**అనకాపల్లి జూన్ శుక్రవారం 26 జయ జయహే**

అనకాపల్లి పట్టణంలో మరియు పరిసర ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలతో ఉక్క పోతతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆకాశం ఉరుములు మెరుపులతో పిడుగులు తో ఆకస్మాత్తుగా అతి భారీ వర్షం పడడం జరిగింది. దీంతో పట్టణంలో రోడ్లన్నీ జలమయము కావడం రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదాచారులు నానా అవస్థలు పడడం జరిగింది ముఖ్యంగా శారద నగర్ పట్టణంలో తాసిల్దార్ కార్యాలయం విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి, రైల్వే స్టేషన్ రోడ్డు, కోట్ని వీధి, గవరపాలెం పార్క్ సెంటర్, కూరగాయల మార్కెట్, లక్ష్మీదేవి పేట, చింతా వారి వీధి, చేపల బజార్ వీధి ఇలాగ పలుచోట్ల కాలువలు పొంగి రోడ్లపై కి వర్షం రావడం జరిగింది దీంతో ప్రతి చోట వాహనదారులు, పాదా చారులు నానాయాతన పడటం జరిగింది. ముఖ్యంగా శారద నగర్ అక్కడ మెయిన్ రోడ్ గోతులు పడడం అలాగే కాలువలు డ్రైనేజీలు పూడుకు పోవడంతో వర్షం నీరు ఎటు వెళ్లలేక





రోడ్లపై నిలిచిపోవడం నిత్యం వర్షం వచ్చినప్పుడు ఇదే విధంగా జరుగుతున్నది .దీనికి శాశ్వత సమస్యకు పరిష్కారం కోసం అధికారులు ఎవరు పట్టించుకోకపోవడంతో నిత్యం వర్షం వస్తే ఇక్కడ శారద నగర్ వాసులు కాలేజీ కొత్తూర్ ,కసింకోట, కొంచంగి, కూ0డ్రం గ్రామ స్తులు ఇదే రోడ్డు నుంచి అనకాపల్లి టౌన్ లోకి రాకపోకలు వాహనదారులు సాగిస్తూ ఉంటారు. ఇప్పుడు వర్షం అధికంగా ఉండడంతో వాహనదారులు అటు హైవే రోడ్డు మీద నుండి ఉమ్మలాడ జంక్షన్ మీదుగా అనకాపల్లి టౌన్ లోకి ప్రజలు రావడం జరుగుతుంది ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న కాలువలు పూడిక తీయడం మరియు మరమత్తు గురైన రోడ్లు వర్షం నీటితో నిండి పోవడంతో వాహన మోటార్ బైకులు దారులు ఆ వర్షం నీటి గోతులో బండి పోతూ ఉండడంతో వాహనదారులు ప్రమాదాలకు లోన్ అవుతున్నారు ఇప్పటికైనా త్వరగా అధికారులు స్పందించి రోడ్లు బాగు చేస్తే వాహనదారులు వారి ప్రయాణం సుఖమంత అవుతుందని అక్కడ స్థానికులు పేర్కొంటున్నారు.




# ఫ్యాక్టరీల మూత.. ఉద్యోగాల కోత

లేఆఫ్స్ వేటు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ ప్రతిపాదిత పునర్వ్యవస్థీకరణ ప్రణాళికను ఇప్పటికే కంపెనీ పర్యవేక్షక మండలి సభ్యులకు చేరవేసినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ వెల్లడించింది. దీనిపై జూలై 9న జరిగే బోర్డు సమావేశంలో అధికారికంగా చర్చించనున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. జర్మనీలోని హానోవర్, జ్వికావ్, ఎమ్డెన్ నగరాల్లో ఉన్న ప్లాంట్లతో పాటు, ఆడి బ్రాండ్‌కు చెందిన నెక్కర్సల్మ్ ఫ్యాక్టరీని మూసివేయాలని కంపెనీ యాజమాన్యం యోచిస్తోంది. ఈ నాలుగు ఫ్యాక్టరీలను మూసివేయడం వల్ల దాదాపు 45,000 మంది కార్మికులు రోడ్డున పడే ప్రమాదం ఉంది. గత 2024 చివరి నాటికి కార్మిక సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఇప్పటికే 50,000 ఉద్యోగాల కోతకు కంపెనీ సిద్ధమైంది. ఇప్పుడు తాజా ప్రణాళికలు కూడా అమల్లోకి వస్తే, ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్‌లో మొత్తం తొలగింపుల సంఖ్య దాదాపు లక్షకు చేరుకుంటుంది.

### సీఈఓ బ్లూమ్ పై తీవ్ర వ్యతిరేకత

ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ సీఈఓ ఒలివర్ బ్లూమ్ ఈ భారీ పునర్వ్యవస్థీకరణ ప్రణాళికను ఈ వారంలోనే కంపెనీ ఉన్నతాధికారుల ముందు ఉంచారు. అయితే ఈ నిర్ణయానికి కార్మిక సంఘాల నుంచే కాకుండా, కంపెనీలో రెండవ అతిపెద్ద వాటాదారుగా ఉన్న జర్మనీలోని 'లోయర్ సాక్సోనీ' రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ ఓవరాల్ ప్లాన్ వివరాలను జర్మన్ పత్రిక 'మేనేజర్ మ్యాగజైన్' మొదటిసారిగా బయటపెట్టింది.

రాబోయే ఐదేళ్లలో తమ పెట్టుబడి వ్యయాన్ని 15 శాతం మేర తగ్గించుకోవాలని ఫోక్స్‌వ్యాగన్ లక్ష్యంగా పెట్టుకుంది. అంటే దాదాపు 130 బిలియన్ యూరోల (148 బిలియన్ డాలర్లు) లోపే పెట్టుబడులను పరిమితం చేయనున్నారు. 89 ఏళ్ల చరిత్ర గల ఈ ఆటోమొబైల్ దిగ్గజాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని సీఈఓ బ్లూమ్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఆర్నో ఆంట్లరిట్జ్ భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఫోక్స్‌వ్యాగన్ ప్రధాన ప్యాసింజర్ కార్ల విభాగాన్ని, స్పేర్ పార్ట్స్ తయారీ విభాగాన్ని వేర్వేరు స్వతంత్ర సంస్థలుగా విభజించే అవకాశం ఉంది.

### ఉద్యోగుల పోరాటం

ఈ రహస్య ప్రణాళికలపై ఫోక్స్‌వ్యాగన్ యాజమాన్యం నేరుగా స్పందించలేదు. కానీ, కంపెనీలోని అన్ని బ్రాండ్లు, అనుబంధ సంస్థల్లో సమూల మార్పులు అవసరమని ప్రతినిధి ఒకరు స్పష్టం చేశారు. మరోవైపు కంపెనీ వర్క్స్ కౌన్సిల్, జర్మనీకి చెందిన శక్తివంతమైన కార్మిక సంఘం 'ఐజీ మెటల్' ఈ ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. "యాజమాన్యం ముందడుగు వేస్తే ఉద్యోగాలను కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధం" అని కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ఆర్థిక సంవత్సరం 2025 లెక్కల ప్రకారం ఫోక్స్‌వ్యాగన్‌కు ప్రపంచవ్యాప్తంగా 6,67,164 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 43 శాతం మంది జర్మనీలోనే పని చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రేడింగ్‌లో ఫోక్స్‌వ్యాగన్ షేర్లు 16 ఏళ్ల కనిష్ట స్థాయికి పడిపోవడం ఇన్వెస్టర్లలో ఉన్న ఆందోళనను తెలియజేస్తోంది.



# పుష్కరాలకు స్వచ్ఛమైన గోదావరి అందించడమే లక్ష్యం

### గోదావరి పరిరక్షణపై అధికారులకు ఇంజనీర్-ఇన్-చీఫ్ ఆదేశాలు

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గోదావరి పరిరక్షణ చర్యలను మరింత వేగవంతం చేయాలని ఇంజనీర్-ఇన్-చీఫ్ (పబ్లిక్ హెల్త్) ఎం. ప్రభాకర్ రావు అధికారులను ఆదేశించారు. రాబోయే గోదావరి పుష్కరాల నాటికి నదిని పూర్తిస్థాయిలో కాలుష్య రహితంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో పర్యటించిన ప్రభాకర్ రావు, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కాతేరు, ధవళేశ్వరం తదితర ప్రాంతాల్లో గోదావరిలోకి మురుగునీరు చేరుతున్న ప్రదేశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. మురుగునీటి ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకునేందుకు చేపట్టాల్సిన చర్యలు, సాంకేతిక అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హుకుంపేటలో నిర్మాణంలో ఉన్న 50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో కూడిన మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ) పనులు తుది దశకు చేరుకున్నాయని అధికారులు వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నగరంలోని మురుగునీటిని శుద్ధి చేసి గోదావరిలోకి చేరకుండా మళ్లించే అవకాశం ఉంటుందని తెలిపారు. వచ్చే ఏడాది పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించనున్న నేపథ్యంలో, వారికి స్వచ్ఛమైన, పరిశుభ్రమైన గోదావరిని అందించేందుకు అన్ని పనులను వేగవంతం చేయాలని ప్రభాకర్ రావు సూచించారు. తాత్కాలిక చర్యలతో పాటు శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని, అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలను వారం రోజుల్లోగా సిద్ధం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గోదావరి పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మురుగునీటి నిర్వహణ వ్యవస్థను ఆధునికీకరించడం ద్వారా నది కాలుష్యాన్ని పూర్తిగా నివారించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో ఎస్ఈ (ఇంజనీరింగ్) రీటా, ఈఈ మదార్ షా అలీ, ఎస్ఈ (పబ్లిక్ హెల్త్) రత్నాకర్ రెడ్డి, ఈఈ శేషగిరి రావు తదితర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

For a pure tomorrow..
జయహో

# గంగా కావేరీ లింకేజ్‌తో భారత్ అన్‌స్టాపబుల్



## ఘనంగా బంకించంద్ర ఛటోపాధ్యాయ జయంతి


**శ్రీకాకుళం (జయ జయహే)**

వందేమాతర గీతం భారత స్వాతంత్య్ర సమరంలో ప్రముఖ పాత్ర పోషించిందని, ఈ గీతం భారతీయుల నోటివెంట వస్తే బ్రిటిష్ వారు భయభ్రాంతులకు గురయ్యేవారని వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళం గాంధీ మందిరం, స్వాతంత్య్ర సమరయోధుల, సంఘ సంస్కర్తల, తేజోమూర్తుల స్మృతి వనంలో శుక్రవారం జరిగిన ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధులు, వందేమాతరం గీత రచయిత బంకించంద్ర ఛటోపాధ్యాయ 188 వ జయంతి వేడుకల్లో వక్తలు మాట్లాడుతూ వందేమాతరం భారతీయులను ఐక్యపరచి ప్రతి ఒక్కరిలో స్వాతంత్య్ర స్ఫూర్తి నింపిందని పేర్కొన్నారు. బంకించంద్ర విగ్రహ దాత ప్రొఫెసర్ నిక్కు అప్పన్న ముందుగా బంకించంద్ర ఛటోపాధ్యాయ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సభ్యులు పుష్పాభిషేకం చేసారు. వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలాపించారు. ఈ సందర్భంగా సెట్ శ్రీ విశ్రాంత సీఈవో సురంగి మోహన రావు,మేడూరి ప్రసాదరావు, డా. జామి భీమ శంకరరావు, ప్రొఫెసర్ నిక్కు అప్పన్న తదితరులు స్వాతంత్య్ర ఉద్యమంలో బంకించంద్ర ఛటోపాధ్యాయ , ఆయన కలం నుండి జాలువారిన వందేమాతరం గీతం పోషించిన పాత్రను పేర్కొన్నారు. అనంతరం గాంధీ మందిరంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి రఘుపతి రాఘవ గీతాన్ని సామూహికంగా ఆలాపించారు. గాంధీ మందిరం తరపున బంకించంద్ర ఛటోపాధ్యాయ విగ్రహ దాత ప్రొఫెసర్ నిక్కు అప్పన్నను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గాంధీ మందిరం సభ్యులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కొంక్యాన వేణుగోపాల్, కొంక్యాన మురళీధర్, గుత్తు చిన్నారావు, పొన్నాన రవి కుమార్, పందిరి అప్పారావు, బుడుమూరు సూర్యారావు,మహిబుల్లాఖాన్ ఖాన్, చౌధరి రాధాకృష్ణ, ఎం వి ఎస్ ఎస్ శాస్త్రి, కె నాగేశ్వరరావు, పెంకి చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు. అవధాన పండితులు పైడి హరనాథ రావు బంకించంద్ర ఛటోపాధ్యాయపై తాను రాసిన గీతాన్ని ఆలపించారు.



**(సి.హెచ్.ప్రతాప్)**

ఉత్తరాన గంగా... దక్షిణాన కావేరి. భారత సంస్కృతికి, వ్యవసాయానికి, నాగరికతకు ప్రాణాధారమైన ఈ రెండు మహానదులు ఒకదానితో ఒకటి అనుసంధానమైతే అది కేవలం జల ప్రాజెక్టు మాత్రమే కాదు, భారత అభివృద్ధి చరిత్రలో ఒక మహత్తర అధ్యాయంగా నిలుస్తుంది. నేలతల్లి దాహార్తిని తీర్చేందుకు పుట్టిన నదులు ఎక్కడ ప్రవహిస్తాయో అక్కడ పచ్చదనం పరుచుకుంటుంది. పంటలు పండుతాయి. గ్రామాలు సస్యశ్యామలంగా మారతాయి. సాగునీరు, తాగునీటి కొరత తగ్గుతుంది. వర్షం కోసం ఆకాశం వైపు ఆత్రంగా ఎదురు చూసే పరిస్థితులు క్రమంగా గతమవుతాయి. వ్యవసాయ-ంమే భారత ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం. పారిశ్రామిక, సాంకేతిక రంగాలు ఎంత అభివృద్ధి చెందినా, చివరికి దేశ స్థిరత్వాన్ని కాపాడేది రైతే. అందుకే "జై జవాన్ -- జై కిసాన్" నినాదం
నేటికీ సజీవంగా ఉంది.



భారత్‌లో నీటి కొరత కంటే నీటి అసమాన పంపిణీ పెద్ద సమస్య. ఒకవైపు వరదలతో సముద్రంలో కలిసిపోతున్న వేల టీఎంసీల నీరు, మరోవైపు కరువుతో అల్లాడుతున్న ప్రాంతాలు కనిపిస్తాయి. గంగా, గోదావరి, కృష్ణా, తుంగభద్ర, కావేరి వంటి జీవనదులు దేశానికి అపారమైన వరం. వీటిని శాస్త్రీయంగా అనుసంధానం చేస్తే నీటి సమతుల్యత సాధ్యమవుతుంది. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచే నదుల అనుసంధానం అవసరమనే చర్చ జరుగుతోంది. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో కూడా దీనిపై గంభీరమైన చర్చలు జరిగాయి. అయితే వివిధ కారణాలతో ఆ ఆలోచన పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చలేదు.

ఇలాంటి సమయంలో కర్ణాటకలోని హోస్పేటలో జరిగిన తుంగభద్ర డ్యామ్ క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ కార్యక్రమం కొత్త ఆశలను రేకెత్తించింది. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొని తుంగభద్ర జలాల వినియోగంపై చర్చించడం సమాఖ్య స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది. రాష్ట్రాలు వేరైనా దేశ ప్రయోజనాలు, రైతుల సంక్షేమం ఉమ్మడిగా ఉండాలనే సందేశాన్ని ఈ సమావేశం ఇచ్చింది.

2024లో తుంగభద్ర ప్రాజెక్టులో 19వ గేటు కొట్టుకుపోవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. అయితే వెంటనే స్టాప్‌లాక్ గేటు ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టారు. అనంతరం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.51 కోట్ల వ్యయంతో మొ-ంత్తం 33 కొత్త క్రస్ట్ గేట్లను ఏర్పాటు చేసి ప్రాజెక్టుకు శాశ్వత బలం చేకూర్చాయి. ఈ చర్యతో మూడు రాష్ట్రాల రైతుల ప్రయోజనాలు రక్షించబడటమే కాకుండా భవిష్యత్ నీటి నిర్వహణకు బలమైన పునాది ఏర్పడింది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశ భవిష్యత్తుకు నదుల అనుసంధానం అత్యవసరమని స్పష్టం చేశారు. ఉత్తర భారతదేశంలో కెన్--బేత్వా ప్రాజెక్టు విజయవంతంగా అమలవుతోందని గుర్తుచేస్తూ, అదే తరహాలో గోదావరి--కావేరి అనుసంధానం జరిగితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. 1983లో అప్పటి ప్రధానమంత్రి, నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి తమిళనాడుకు తాగునీరు అందించే నిర్ణయం తీసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర సహకారంతో చెన్నైకి 15 టీఎంసీల తాగునీరు అందించిన చరిత్ర సహకార సమాఖ్యకు గొప్ప ఉదాహరణ అని చెప్పారు.

చంద్రబాబు చేసిన అత్యంత ప్రాధాన్యమైన వ్యాఖ్య గంగా--కావేరీ అనుసంధానంపైనే. ఉత్తర భారతదేశంలో మిగులు జలాలను దక్షిణానికి మళ్లించే సమగ్ర జాతీయ ప్రణాళిక అమలైతే వ్యవసాయం, పారిశ్రామికాభివృద్ధి, తాగునీటి భద్రత, జలవిద్యుత్ ఉత్పత్తి వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. "గంగా--కావేరీ లింకేజ్ అమలైతే భారత్ అభివృద్ధి అన్‌స్టాపబుల్" అనే ఆయన వ్యాఖ్య దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది.

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో జలాశయాలకు నీటి ప్రవాహాలు తగ్గుతున్న నేపథ్యంలో నీటి ప్రతి బొట్టును పొదుపుగా వినియోగించుకోవడం అత్యవసరం. ముందుగా ప్రతి రాష్ట్రం అంతర్గతంగా నదుల అనుసంధానం చేపట్టి, ఆ తర్వాత రాష్ట్రాల మధ్య అనుసంధానాన్ని విస్తరించాలన్న సూచన కూడా ఆచరణయోగ్యమైనదే. తుంగభద్ర నది విజయనగర సామ్రాజ్యానికి సహజ రక్షణ కవచంగా నిలిచినట్లే, నేడు కోట్లాది రైతుల జీవనాధారంగా కొనసాగుతోంది. జోగులాంబ, హంపీ విరూపాక్ష, మంత్రాలయం వంటి పుణ్యక్షేత్రాలకు కూడా ఈ నది జీవనరేఖ.

నదులు రాజకీయాల సరిహద్దులను గుర్తించవు. అవి ప్రకృతి ప్రసాదించిన జాతీయ సంపద. వాటిని ప్రాంతీయ భావజాలానికి పరిమితం చేయకుండా శాస్త్రీయ దృష్టితో వినియోగిస్తేనే దేశ జల భద్రత సాధ్యమవుతుంది. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ సహకార సమాఖ్యకు నాంది పలికినట్లే, గంగా--కావేరీ అనుసంధానం భారత వ్యవసాయాన్ని, ఆర్థిక వ్యవస్థను, జల భద్రతను కొత్త శిఖరాలకు తీసుకెళ్లే జాతీయ ప్రాజెక్టుగా అవతరించాలని దేశ ప్రజల ఆకాంక్ష.



# దైవానికీ ఆకలేస్తుందా?

### దేవుడికి నైవేద్యం ఎందుకు పెట్టాలి?

### దేవుడికి నైవేద్యం పెట్టడం వెనుక ఆంతర్యం ఏమిటి?

**(పుట్టా శ్రీనివాస్ రావు)**

దేవాలయాలకు వెళ్లినప్పుడు లేదా ఇంట్లో భగవంతుడికి పూజ చేసినప్పుడు నైవేద్యం సమర్పిస్తాం. ఆపై దాన్ని ప్రసాదంగా స్వీకరిస్తుంటాం. ఇదే క్రమంలో చాలా మందికి నైవేద్యం విషయంలో రకరకాల సందేహాలు వస్తుంటాయి. మనం పెట్టే నైవేద్యాన్ని పరమాత్ముడు స్వీకరిస్తాడా? దైవానికీ ఆకలి వేస్తుందా? దేవుడికి నైవేద్యం పెట్టడం వెనుక ఆంతర్యం ఏమిటి? ఒకసారి తెలుసుకుందాం...

నైవేద్యం స్వామివారి సన్నిధానంలో ఉంచి ఆపైన నేతితో అభీకరించిన తర్వాత కాసిన్ని నీళ్లు చేతిలోకి తీసుకుని అవోక్షణం అంటూ చేతిని బోర్లా వేసి నీటిని చిలకరిస్తాం. ఆ తర్వాత చుట్టూరా నీళ్లు తిప్పి స్వామివారి నామం స్మరిస్తూ నైవేద్యం సమర్పిస్తుంటాం. పరమాత్ముడు నిజంగా మనం ప్రసాదాల రూపంలో అర్పించే పదార్థాలను నివేదనగా స్వీకరిస్తాడా? అంటే, స్వామివారు నిజంగా స్వీకరించే ప్రయత్నమే చేస్తే ప్రపంచంలో పదార్థమే లేకుండా పోతుంది. పరమాత్ముడు ప్రపంచంలో సమస్తాన్ని సృష్టించినవారు కదా మరి ఇది ఎలా సమర్థించుకోవాలి. విష్ణుపురాణం ఇక్కడ ఒక ప్రతీకాత్మకమైనటువంటి శ్లోకంతో పరమాద్భుతమైన సందర్భ రూపమైనటు వంటి ధర్మాన్ని బోధిస్తుంది. అదేంటంటే...

"ఏకో విష్ణుర్మహద్భూతం పృథగ్భూతాన్యనేకశః
త్రిల్లోకాన్వ్యాప్య భూతాత్మా భుంక్తే విశ్వభుగవ్యయః"

ఈ శ్లోకం అర్థం ఏమిటంటే.. ఒకే విశ్వరూపం ప్రపంచవ్యాప్తమైన చైతన్య స్వరూపం, సమస్త జీవకోటిలో రుచి అనే రూపంలో చేరి ఆ పదార్థాన్ని వాసనతో స్వీకరిస్తుంది. ప్రత్యక్షంగా ఆ పదార్థం అలాగే ఉంటుంది.కానీ, ఆ పదార్థానికి అలా నీళ్లు చిలకరించి, గాయత్రీ మంత్రంతో అభిమంత్రించిన అనంతరం నివేదన ముద్రలతో సమర్పిస్తే స్వామి స్వీకరిస్తున్నాడు. మనం మౌనం పాటిస్తున్నాం. కళ్లు మూసుకుంటున్నాం. ఈ భక్తి భావన జతపరిచిన కారణం చేత ఆ పదార్థం ప్రసాదంగా మనం స్వీకరించే యోగ్యతతో ఇప్పుడు నైవేద్యంగా రూపుదిద్దుకుంటుంది. ఇలా పదార్థం- నైవేద్యం-ప్రసాదంగా




మారుతుంది. ఆ ప్రసాదాన్ని మనం పరమాత్ముడు తిరిగి ఇచ్చిన దానిగా భావన చేసి స్వీకరిస్తాము.

ప్రకృతిలో లభించే ప్రతి పదార్థము భగవంతుని రూపమే

ప్రకృతిలో లభించే ప్రతిదానిని పరమాత్మ సన్నిధానంలో ఉంచి పరమాత్మ కారణంగానే ఈ పదార్థం మనకు లభించింది. అది బట్టి పదార్థం పరమాత్ముడి దృష్టి చేత నైవేద్యంగా, అనంతరం మనం స్వీకరించే ప్రసాదంగా రూపుదిద్దుకుంటుందంటున్నారు. అప్పుడు దాన్ని స్వీకరిస్తే అది ప్రసాదం అవుతుందంటున్నారు. మనలో ఉన్న వైశ్వావరుడికి ఈ ప్రసాదం శక్తిని అందిస్తుంది. యోగులు, మహారుషులు చాలా తక్కువగా తింటారు. దొరికిందల్లా తినేయరు. ఓసారి తింటారు అయిపోయింది ఈరోజుకి అనుకుంటారు. మిగతా సమయమంతా ధ్యానంపైనే దృష్టిపెడతారు.ఈ ధ్యాన దృష్టిని పెంచేది నైవేద్యం, ప్రసాదం.

చివరగా విష్ణు పురాణంలో ఈ నైవేద్యానికి సంబంధించిన భావన ఎలాంటిదంటే, సమస్త జీవులలో ఉన్నటువంటి రుచి, వాసన ఈ రెండింటి కారణంగానే పరమాత్మ ఆ పదార్థాన్ని స్వీకరించాడన్న జ్ఞానం మనలో స్థిరపడుతుంది.

# మాలలపై అణచివేతను సహించం

### విజయవాడలో మాలల దండయాత్ర

### మల్లెల వెంకటరావు




**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**

రాష్ట్రంలో మాలలను అణిచివేసే కుట్రలను తిప్పికొడతామని, మాలల హక్కుల పరిరక్షణ కోసం ఆగస్టు నెలలో విజయవాడ కేంద్రంగా భారీ మాలల దండయాత్ర నిర్వహిస్తామని మాల మహాసభ అధ్యక్షులు మల్లెల వెంకటరావు హెచ్చరించారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని క్వారీ మార్కెట్ సెంటర్‌లోని బీఎన్ఆర్ మినీ ఫంక్షన్ హాల్‌లో మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన మాలల ఐక్యత చైతన్య యాత్ర సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని సుమారు 80 లక్షల మంది మాలలను ఐక్యం చేయడమే లక్ష్యంగా హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు మాలల ఐక్యత చైతన్య యాత్ర చేపట్టినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రెండూ మాలల పట్ల వివక్ష చూపుతున్నాయని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు పేరుతో అమలు చేస్తున్న ఏ, బి, సి, డి వర్గీకరణ వల్ల మాలలకు అన్యాయం జరుగుతోందని, జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలని, ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలపై మాలలు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. మాల జాతికి చెందిన ప్రజాప్రతినిధులు ఈ అంశాలపై స్పందించాలని కోరారు. మాలలపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గొల్ల అరుణ్ కుమార్, మాలల సంక్షేమ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కోట్ల గంగాధర్, రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్ పాల్, కోస్తాంధ్ర కన్వీనర్ మాదే రామచంద్రరావు, డాక్టర్ సుబ్బారాయుడు, గుబ్బల రాంబాబు, ఆరే రాము, విజ్జిన మధు, కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి రాజేంద్ర ప్రసాద్, రేబాక అబ్బులు, కొల్లి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# 381 కిడ్నీ మార్పిడులతో యశోద ఆసుపత్రి అరుదైన ఘనత

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**

హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రి నెఫ్రాలజీ విభాగం కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో మరో అరుదైన మైలురాయిని నమోదు చేసింది. అత్యంత సంక్లిష్టమైన మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించి ఇప్పటివరకు 381 మంది రోగులకు కొత్త జీవితాన్ని అందించినట్లు ఆసుపత్రి వైద్య నిపుణులు వెల్లడించారు. ఈ విజయానికి సంబంధించిన వివరాలను రాజమహేంద్రవరంలో నిర్వహించిన అవగాహన సదస్సులో నెఫ్రాలజిస్టులు వెల్లడించారు.సాధారణంగా కిడ్నీ మార్పిడిలో అవయవ దాత, గ్రహీత రక్త వర్గాలు ఒకే విధంగా ఉండడం అవసరమనే అభిప్రాయం ఉంది. అయితే ఆధునిక వైద్య సాంకేతికత, అత్యాధునిక చికిత్సా విధానాల సహాయంతో భిన్న రక్త వర్గాలు ఉన్న దాతలు, గ్రహీతల మధ్య కూడా విజయవంతంగా కిడ్నీ మార్పిడి చేయగలుగుతున్నామని వైద్యులు తెలిపారు. ఈ తరహా శస్త్రచికిత్సలు అత్యంత క్లిష్టమైనవైనా, నిపుణుల బృందం సమన్వయంతో విజయవంతంగా నిర్వహిస్తున్నామని వివరించారు.వయస్సు కూడా కిడ్నీ మార్పిడికి అడ్డంకి కాదని యశోద ఆసుపత్రి వైద్యులు స్పష్టం చేశారు. 60 సంవత్సరాలు దాటిన పలువురు రోగులకు సైతం సురక్షితంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచామని పేర్కొన్నారు. సరైన వైద్య పరీక్షలు, శారీరక పరిస్థితి అనుకూలంగా ఉంటే వృద్ధులకు కూడా అవయవ మార్పిడి విజయవంతంగా చేయవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా నెఫ్రాలజిస్టులు డాక్టర్ రాజశేఖర చక్రవర్తి, డాక్టర్ పి. విజయ్ వర్మ మాట్లాడుతూ,




దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న వారికి డయాలసిస్ తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని, శాశ్వత పరిష్కారం కిడ్నీ మార్పిడేనని వివరించారు. విజయవంతమైన మార్పిడి అనంతరం రోగులు సాధారణ జీవనశైలికి తిరిగి చేరుకోవడంతో పాటు కుటుంబంతో ఆనందంగా జీవించే అవకాశం లభిస్తుందని చెప్పారు. ఇప్పటివరకు నిర్వహించిన 381 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు కేవలం గణాంకాలు కాదని, వందలాది కుటుంబాలకు ఆశ, ఆనందం, కొత్త జీవితాన్ని అందించిన విజయగాథలని పేర్కొన్నారు.భిన్న రక్త వర్గాల మధ్య కిడ్నీ మార్పిడి సాధ్యమవుతుందనే విషయంపై ప్రజల్లో ఇంకా పూర్తి స్థాయి అవగాహన లేదని వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక వైద్య సాంకేతికతతో ఈ తరహా మార్పిడులు సురక్షితంగా నిర్వహించే అవకాశాలు పెరిగాయని, అర్హులైన రోగులు భయపడకుండా నిపుణులను సంప్రదించాలని సూచించారు.అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అత్యాధునిక మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన నెఫ్రాలజిస్టులు, ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు, ప్రత్యేక వైద్య బృందంతో యశోద ఆసుపత్రి అవయవ మార్పిడి రంగంలో దేశవ్యాప్తంగా విశ్వసనీయ సేవలు అందిస్తోందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. రోగి భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రతి మార్పిడి ప్రక్రియను కచ్చితమైన వైద్య ప్రమాణాలతో నిర్వహిస్తున్నామని వివరించారు.రాజమహేంద్రవరంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి మార్కెటింగ్ ప్రతినిధులు ఎస్.వి. రామకృష్ణ, వి. సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజల్లో అవయవదానంపై అవగాహన పెంపొందించడం, కిడ్నీ వ్యాధులపై ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని వైద్యులు పిలుపునిచ్చారు.



## రంగస్థల విభాగం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షునిగా అంబటి

**విశాఖపట్నం (జయ జయహే)**

ఆంధ్ర విశ్వ కళా పరిషత్ రంగస్థల విభాగం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షునిగా అంబటి విజయ రాఘవన్, గౌరవ అధ్యక్షులుగా విభాగం ఆచార్యులు డాక్టర్ భాస్కరరావు మరపట్ల ఎన్నికయ్యారు. పౌర గ్రంధాలయాలు గురువారం సాయంత్రం జరిగిన ఆంధ్ర విశ్వ కళా పరిషత్ రంగస్థలం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ ఆచార్య నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల అధికారిగా విభాగం పూర్వ విద్యార్థి బి వి కే కళాశాల పూర్వ ప్రిన్సిపల్ పి. వెంకట రమణమూర్తి వ్యవహరించారు. పరిశీలకులుగా ప్రముఖ రంగస్థలం కళాకారులు చలసాని కృష్ణ ప్రసాద్ బాధ్యతలు నిర్వహించారు. ప్రముఖ రంగస్థలం నటులు శ్రీరామ్మూర్తి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. గౌరవాధ్యక్షులు డాక్టర్ భాస్కర రావు మరపట్ల, అధ్యక్షులు అంబటి విజయ రాఘవన్, ఉపాధ్యక్షులు సేనాపతి మహేష్, ప్రధాన కార్యదర్శి బి.ఎస్. చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి డాక్టర్ డి. దీనబంధు, కోశాధికారి ఎస్ వి వి సత్యమూర్తి, కార్యవర్గ సభ్యులుగా డి. హేమ వెంకటేశ్వరి, ఎం శివజ్యోతి,, డాక్టర్ అపూర్వ, టి. అనురాధ,, నవరస మూర్తి, ఆకిరి సురేష్, చోడిశెట్టి శ్రీనివాసరావు , పీ. గిరిధర్, టి. రమేష్, ఎస్ వెంకట తేజ ఎన్నికయ్యారు. న్యాయ సలహాదారులుగా పూర్వ విద్యార్థులైన న్యాయవాదులు కె.వి జయ చంద్ర వర్మ, విజయ లక్ష్మి నియమితులయ్యారు. పూర్వ విద్యార్థులైన ప్రముఖ రంగస్థలం కళాకారులు గౌరవ సలహాదారులుగా వ్యవహరిస్తారు. ఎన్నికల ప్రక్రియకు సంధానకర్తగా నాగనబోయిన నాగేశ్వరరావు బాధ్యతలు నిర్వహించారు.



## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

**రాజమండ్రిలో ఘనంగా**

**అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం**

**రాజమహేంద్రవరం: జయ జయహే :జూన్ 26:**

యువతను రక్షిద్దాం – దేశ భవిష్యత్తును కాపాడుకుందాం" అనే నినాదంతో అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాజమండ్రిలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐ.జి.పి. ఆకే రవి కృష్ణ, ఎస్పి డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు 'నషాముక్త భారత్ అభియాన్'లో భాగంగా నందం గనిరాజు జంక్షన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ, దేవీచౌక్ మీదుగా గాంధీ సెంటర్ వరకు కొనసాగింది.మాదకద్రవ్యాలు వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ వ్యవస్థను, సమాజ పురోగతిని దెబ్బతీస్తాయని అధికారులు హెచ్చరించారు. యువత క్రీడలు, విద్య, సృజనాత్మక రంగాలపై దృష్టి సారించాలని కోరారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగంపై సమాచారం తెలిస్తే వెంటనే 1972 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారిస్ ప్రతినిధులు, సజ్జన్ సమాజ్ సభ్యులు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్యులు, పుష్కరమతా డీ–అడిక్షన్ సెంటర్ నుండి డాక్టర్ సుందరం వారి బృందం, జిల్లా ఎన్.డి.పి.ఎస్ సి ఐ వై. రాంబాబు, ఈగల్ రాజమండ్రి సిఐ పి.వి. సూర్యమోహన్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.




## ఉపాధ్యాయుల సమగ్ర సీనియారిటీ జాబితా విడుదల చేయాలి

**అనకాపల్లి జూన్ శుక్రవారం 26, జయ జయహే.**

ఉమ్మడి జిల్లాల కు శాశ్వత ప్రతిపాదికన ఉద్యోగుల విభజన అనే అంశంపై శుక్రవారం అనకాపల్లి సిఐటియు ఆఫీస్ కార్యాలయంలో జరిగిన సదస్సులో జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమగ్ర సీనియారిటీ జాబితాలను తయారుచేసి వెంటనే విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాశ్వత ప్రతిపాదించిన కొత్త జిల్లాలు ఉమ్మడి జిల్లా నుండి వేరు అవుతున్న సందర్భంగా, ప్రభుత్వం ఉద్యోగులను కూడా శాశ్వత ప్రతిపాదిక విభజన చేయాలని భావిస్తున్న తరుణంలో ఉమ్మడి విశాఖ జిల్లా ప్రతిపాదించిన మూడు జిల్లాల ఉపాధ్యాయుల సమగ్ర సీనియారిటీ ప్రకారం జాబితా విడుదల చేయాలని విశాఖ జిల్లాలో 12 క్యాడర్ లలో సుమారు 14000 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని వారందరికీ క్యాడర్ ల వారీగా సమగ్ర సీనియారిటీ జాబితాలు విడుదల చేసి నూతన జిల్లాల మండల మరియు జిల్లా విద్యా కార్యాలయాలలో ప్రదర్శించాలని వారి డిమాండ్ చేశారు. ఒక ప్రక్క ప్రభుత్వం ఉద్యోగులు విభజన ప్రక్రియను వేగవంతం చేస్తుంటే విద్యా శాఖలో మాత్రం నేటికీ అధికారికంగా సీనియారిటీ జాబితాలను ప్రదర్శించకపోవడం సరికాదని వారన్నారు కాబట్టి వెంటనే ఆ జాబితాలను విడుదల చేసి జాబితాల సవరణకు కూడా సమయం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వాత్సవాయి శ్రీలక్ష్మి, గౌరవ అధ్యక్షుడు పంపన బోయిన వెంకటరావు సహాధ్యక్షులు ఆర్ ఉమాదేవి, జిల్లా కార్యదర్శి గేదెల శాంతిదేవి, వైరాల రమేష్, గుత్తుల సూర్య ప్రకాష్, ఉప్పాడ రాము, సంతోష్, ఆడిట్ కన్వీనర్ బయ్యలపూడి దేవుడు నాయుడు మరియు అన్ని మండలాల ఉపాధ్యాయులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది



## మంత్రులు మీ కన్వాయ్‌లతో రోడ్లు బంద్ సరికాదు

**మరణావస్థలో ఉన్న వ్యక్తులకు శాపం**

**తమిళనాడు రాష్ట్రాన్ని చూసి నేర్చుకోవాలి**

**డాక్టర్ నాడిశెట్టి శాంతారావు-**

**విజయనగరం జూన్ '26 (జయ జయహే)**

తమిళనాడు సినీ హీరోగా నటించిన నేటి సీఎం విజయ్ దళపతి పరిపాలన విధానం చూసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాలకులు నేర్చుకోవాలి. ఒకమారు తమిళనాడు రాష్ట్రంలో సాక్షాత్తు సీఎం విజయ్ దళపతి కాన్వాయ్ చూస్తే కుడి భాగంలో ప్రయాణిస్తుంటే.. సామాన్య ప్రజలు మొదలుకొని అందరు ఎటువంటి ఆటంకం లేకుండా ఎడమవైపు భాగంలో ప్రయాణించే తీరునుచూస్తుంటే అందరికీ ఆశ్చర్యం మేస్తుంది ఆ రాష్ట్రాన్ని చూసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాలకులు నేర్చుకోవాలసినవి చాలా ఉందని శ్రీ గోపినాథం సాంస్కృతిక సేవా సంస్థ ఛైర్మన్ డాక్టర్ నాడిశెట్టి శాంతారావు తన లేఖలో పేర్కొన్నారు. మానవత్వంతో ఆలోచిస్తే ప్రమాదంలో మరణావస్థలో ఉన్న వ్యక్తులు ముందస్తు సమయంలోపే వెళ్లాలనుకునే 108 వాహనాలకు కూడా ఈ రోడ్లు బంద్ కారణంగా వేరే మార్గం గుండా వెళ్ళమని పోలీసులు చెప్పడంపై వాహనంలో అనేక ఇబ్బందులకు గురయ్యామని శ్రీ గోపినాథం సాంస్కృతిక సేవా సంస్థ కు ఫోన్ లో ఏడుస్తూ మాట్లాడారు. ఇకనైనా ఇటువంటి రోడ్లు బంద్ సమయంలో 108 వాహనాలకు దారిని మళ్ళించే ప్రయత్నాలు చేయకుండా ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శ్రీ గోపినాథం సాంస్కృతిక సేవా సంస్థ ఛైర్మన్ డాక్టర్ నాడిశెట్టి శాంతారావు కోరారు.


### రాధా రంగా చారిటబుల్ ట్రస్ట్

## రాష్ట్ర యూత్ కార్యదర్శిగా కొంకిపూడి

**పాయకరావుపేట, జూన్ 26 :(జయ జయహే)**

ఆంధ్రా, తెలంగాణా రాధా రంగా మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర కార్యదర్శిగా పాల్తేరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కొంకిపూడి రమేష్ ను నియమించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్నేహితులు కొంకిపూడి రమేష్ కు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ సందర్భంగా కొంకిపూడి రమేష్ మాట్లాడుతూ... రాధా రంగా మిత్రమండలి బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.





## సమస్యల పరిష్కారానికి భరోసా: బిజెపి 'జనతా వారధి'లో స్వీకరించిన అర్జీలు

**రాజమహేంద్రవరం: జయ జయహే :జూన్ 26:**

'మీ సమస్య... మా బాధ్యత' అనే నినాదంతో ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిలా నిలుస్తూ భారతీయ జనతా పార్టీ చేపట్టిన 'జనతా వారధి' కార్యక్రమం స్థానిక క్వారీ ఏరియాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. సీనియర్ నాయకులుఎపిఆర్ చౌదరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రజల నుండి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా లలితా నగరం, సంజీవనగర్ వాసులు తమకు గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్ల స్థలాలను చూపించలేదని పెద్ద సంఖ్యలో మహిళలు అర్జీలు అందజేశారు. అలాగే వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగుల నుంచి పింఛన్ల కోసం, నందరాడ గ్రామం నుండి గృహ హింసకు సంబంధించి పలు వినతులు అందాయి.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ నిరంతరం కృషి చేస్తోందని ఎపిఆర్ చౌదరి తెలిపారు. వచ్చిన సమస్యలన్నింటినీ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జనతా వారధి జిల్లా కన్వీనర్ శివరామ కృష్ణంరాజు, కో–కన్వీనర్ బండి సత్య ప్రసాద్, కురగంటి సతీశ్, యనాపు ఏసు, స్వామి సూర్యకిరణ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# గచ్చిబౌలి షూటింగ్ రంగస్థలంపై నాసిర్ అలీ సంచలనం

**- ఐదు పతకాలతో అప్రతిహత విజయం**

**- రాష్ట్ర స్థాయిలో విశాఖ యువ క్రీడాకారుడి సత్తా**

**- జాతీయ స్థాయిపై దృష్టి పెట్టిన ప్రతిభావంతుడు**

**విశాఖపట్నం, జూన్ 26, జయ జయహే :**

హైదరాబాద్ గచ్చిబౌలిలోని సాట్ షూటింగ్ రేంజ్‌లో 2026 జూన్ 20 నుండి 28 వరకు ఘనంగా నిర్వహించిన 26వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీల్లో విశాఖ నగరానికి చెందిన యువ క్రీడాకారుడు నాసిర్ అలీ అద్భుత ప్రతిభ కనబరుస్తూ ఐదు పతకాలతో సంచలన విజయాన్ని నమోదు చేసి రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాడు.ఎయిర్ స్మాల్ బోర్, షాట్ గన్ ఈవెంట్లలో పాల్గొన్న నాసిర్ అలీ పోటీల ప్రతి దశలోనూ అద్భుతమైన కచ్చితత్వం, దృఢ సంకల్పం, మానసిక స్థైర్యంతో పోటీదారులను మించిపోతూ 2 బంగారు, 2 వెండి, 1 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నాడు. ఈ అప్రతిహత ప్రదర్శన షూటింగ్ రంగంలో నూతన ప్రతిభగా నిలిపింది. పోటీలలో ప్రతి షాట్‌లోనూ అతని లక్ష్యసాధన స్పష్టంగా కనిపించగా, సమయపాలన,



క్రమశిక్షణ, శారీరక–మానసిక సమతుల్యత అతన్ని విజయపథంలో నిలబెట్టాయి. కోచ్‌ల సూచనలను కచ్చితంగా అమలు చేయడం, నిరంతర సాధనతో తన నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడం అతని విజయానికి ముఖ్య కారణాలుగా నిలిచాయి. చిన్న వయస్సులోనే షూటింగ్ క్రీడపై ఆసక్తి పెంచుకున్న నాసిర్ అలీ ప్రతిరోజూ కఠిన సాధన చేస్తూ, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతున్నాడు. కుటుంబ సభ్యుల నిరంతర ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం అతనిలో విశ్వాసాన్ని పెంపొందించి విజయానికి దారితీశాయి.నాసిర్ అలీ సాధించిన ఈ విజయాలు కేవలం వ్యక్తిగత గెలుపునకే పరిమితం కాకుండా, విశాఖ నగరానికి ప్రత్యేక గౌరవాన్ని తీసుకువచ్చాయి. అతని ప్రతిభపై కుటుంబ సభ్యులు, స్నేహితులు, గురువులు హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో అతను జాతీయ మరియు అంతర్జాతీయ వేదికలపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. క్రీడా నిపుణులు మాట్లాడుతూ, "నాసిర్ అలీలో ఉన్న కచ్చితత్వం, మానసిక స్థైర్యం, క్రమశిక్షణ అతన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లగలవు. సరైన శిక్షణ, సదు–పాయాలు లభిస్తే అతను దేశానికి కీర్తి తీసుకురావడం ఖాయం" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు అతన్ని అభినందిస్తూ, యువత క్రీడల వైపు ముందుకు రావడానికి నాసిర్ అలీ విజయాలు ప్రేరణగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. సమాజం నుంచి, ప్రభుత్వ సంస్థల నుంచి మరింత ప్రోత్సాహం లభిస్తే ఇలాంటి ప్రతిభావంతులైన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని వారు తెలిపారు.

# మా నాన్నే...నాకు స్ఫూర్తి...

**- పీ.వి. చలపతిరావు జయంతి వేడుకల్లో మాధవ్**

**- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన "వీర సావర్కర" చారిత్రక నాటకం**

**విశాఖపట్నం, జూన్ 26, జయ జయహే :**




"నా తండ్రి పీ.వి. చలపతిరావే నాకు స్ఫూర్తి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. చలపతిరావు 92వ జయంతి వేడుకలు శుక్రవారం సాగరమాల ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పీ.వి. చలపతిరావుకు వీర సావర్కర్‌తో ఉన్న సంబంధం ఏమిటని కొందరు ప్రశ్నించవచ్చు.నని, వీర సావర్కర్ జాతీయవాద స్ఫూర్తిని, దేశభక్తిని ఆదర్శంగా తీసుకుని చలపతిరావు ప్రజా జీవితాన్ని కొనసాగించారు" అని పేర్కొన్నారు.ఆయన పుట్టినరోజు జూన్ 26 కాగా, దానికి ముందు రోజు అయిన జూన్ 25, 1975 అర్ధరాత్రి దేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించారు. ఆ సమయంలో ఆయనపై అరెస్టు వారెంట్ జారీ చేశారు. పార్టీ ఆదేశాల మేరకు అరెస్టుకు దొరకకుండా 19 నెలల పాటు మారు వేషంలో తిరుగుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమానికి ఊపిరి పోశారు" అని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా. బొమ్మరాజు సారంగిపాణి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మేధావులు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, వీర సావర్కర్ ధైర్యసాహసాలు, దేశభక్తి, త్యాగనిరతిని వివరించారు. సావర్కర్ సుమారు 32 సంవత్సరాల పాటు జైలు జీవితాన్ని గడుపుతూ 12 పుస్తకాలను రచించారని తెలిపారు. అండమాన్ జైలులో గోడలపై వేలాది పద్యాలను రచించి, వాటిని అనంతరం పుస్తక రూపంలో తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తిగా ఆయనను అభివర్ణించారు. సావర్కర్ ఆలోచనలు, సిద్ధాంతాలు అనేక మంది యువతను జాతీయోద్యమాల్లో పాల్గొనేలా ప్రేరేపించాయని పేర్కొన్నారు. డా. బొమ్మరాజు సారంగిపాణి మాట్లాడుతూ, దివంగత పీ.వి. చలపతిరావు చేసిన సేవలను కొనియాడారు. ఎమర్జెన్సీ కాలంలో తాము ఆయనతో కలిసి సుమారు 19 నెలల పాటు అజ్ఞాతంలో ఉన్నామని గుర్తుచేశారు. ఆ సమయంలో చలపతిరావు మార-ువేషాల్లో సంచరిస్తూ ఉద్యమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేవారని తెలిపారు. అలాగే, అండమాన్ సెల్యులార్ జైలులో వీర సావర్కర్ అనుభవించిన కష్టాలు, దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, సత్యకుమార్ మాస్టారు, సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ కృష్ణ, పరశురాం రాజు, ద్వారంపూడి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## అరకులో క్రీడా సంబరం! గిరిజన యువతకు కొత్త వాలీబాల్ కోర్టు

**అరకులోయ: జయ జయహే.**





అరకులోయ గిరిజన యువత క్రీడా కల సాకారం! అరకులోయలో నూతన వాలీబాల్ కోర్టుకు ఘనంగా శంకుస్థాపన జరిగింది." ఈ సందర్భంగా అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనుజారాణి మాట్లాడుతూ.. గిరిజన య-ువతలో అపారమైన క్రీడా నైపుణ్యం ఉందని, వారికి తగిన ప్రోత్సాహం అందిస్తే జాతీయ స్థాయిలో రాణించగలరని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వెనుక రాజ్యసభ సభ్యులు వై.వి. సుబ్బారెడ్డి కృషి ఎంతో ఉంది. గిరిజన క్రీడాకారుల కోసం ఆయన తన ఎంపీ నిధుల నుండి రూ. 30 లక్షలు మంజూరు మంజూరు చేశారని ఎంపీ సుబ్బారెడ్డి ని కొనియాడారు. సహజ సిద్ధమైన శారీరక దారుఢ్యం కలిగిన మన గిరిజన యువత, ఈ కోర్టును సద్వినియోగం చేసుకుని క్రీడల్లో అద్భుతాలు సృష్టించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు."ఈ కార్యక్రమంలో స్థానిక టౌన్షిప్ ఎంపిటిసి దురయా ఆనంద్ కుమార్, పెదలబుడు ఎంపిటిసి , వాలీబాల్ క్రీడాకారుల, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం


**బోరుభద్ర లో 10 కోట్ల తో అభివృద్ధి పనులు ప్రారంభం**

**ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వ నెరవేరుస్తుంది**

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు**

**టెక్కలి జూన్ 26 జయ జయహే**

రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ గ్రామస్థాయిలో కచ్చితంగా కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన నాయకత్వంలో గ్రామస్థాయి అభివృద్ధినీ సాధించి తీరుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు స్పష్టం చేశారు. టెక్కలి నియోజకవర్గం మారుమూల గ్రామాల్లో స్వర్గీయ కింజరాపు ఎర్రం నాయుడు ఆశయాలను నెరవేర్చే దిశగా ప్రతి పల్లెలోని రహదారులు మంచినీరు వంటి మౌలిక సదుపాయాలను తీరుస్తున్నామన్నారు. ఈ మేరకు మంత్రి అచ్చం నాయుడు సంతబొమ్మాలి మండలం బోరుభద్ర పంచాయితీ లో విస్తృతంగా పర్యటించి 10 కోట్ల రూపాయల తో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా రైతాంగం సంక్షేమం కోసం వంశధార ప్రాజెక్టు కాలువ ఆధునీకరణ పనులకు 10 కోట్లు మంజూరు చేసామన్నారు, రాబోయే రెండేళ్లలో నేరేడు బ్యారేజీ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతపదికన పూర్తి చేసి జిల్లాలోని రైతులు మూడు పంటలు సమృద్ధిగా పండించుకునేలా సాగునీరు అందిస్తామని ప్రతి గ్రామంలోని కనీస సదుపాయాలను కల్పించి స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ప్రగతిని సాధిస్తామని మంత్రి కింజరాపు అచ్చం నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు అనధికారులు ప్రజాప్రతినిధులు స్థానికులు పాల్గొన్నారు.



## సర్ కార్యక్రమంలో పకడ్బందీగా పని చేయాలి...

**కాంగ్రెస్ నేతలకు జువ్వాడి కృష్ణారావు దిశా నిర్దేశం...**

**కోరుట్ల (జయ జయహే)**

తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ఓటరు పరిశీలన కార్యక్రమం ప్రారంభమై సందర్భంగా శుక్రవారం కోరుట్ల పట్టణ 13వ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన ఎస్ఐఆర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు విచ్చేసి మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ బిఎల్ఓ లతో కలిసి వార్డు ప్రజలకు ఎస్ఐఆర్ ఫారాలను అందజేశారు అనంతరం జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఓటరు పరిశీలన కార్యక్రమం గురువారం ప్రారంభమైందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇట్టి విషయంపై కాంగ్రెస్ పార్టీ నేతలు బిఎల్ఏ లు పకడ్బందీగా వ్యవహరించాలని ఆదేశించారని కోరుట్ల నియోజకవర్గంలోని ఏ ఒక్క ఓటు కూడా అక్రమ తొలగింపుకు గురికాకూడదని దీనికి పార్టీ బూత్ లెవల్ ఇన్చార్జిలు ఇతర శ్రేణులు నాయకులు పూర్తి బాధ్యతాయుతంగా పని చేయాలని కోరారు ఈకార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు తోపాటు మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి కోరుట్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి 143 బూత్ లెవెలు ఏజెంట్ ఒలేపు రాజేష్ అంగన్వాడీ టీచర్ తిరుమల హిమగిరి కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి హామీ శ్రామికులతో జనసేన రాజు ముఖా ముఖి

**చోడవరం జూన్ 26 జయ జయహే**

చోడవరం మండలం జన్నవరం శ్రీరామపట్నం గ్రామ ఉపాధి హామీ శ్రామికులతో జనసేన పార్టీ ఇంచార్జ్ పివిఎస్ఎన్ రాజు శుక్రవారం నేరుగా సమావేశం అయ్యారు.

ఈ సమావేశంలో ఉపాధి హామీ శ్రామికులు పలు విషయాలు రాజు దృష్టికి తీసుకు వచ్చారు. చోడవరం చక్కెర కర్మాగారనికి తాము సప్లై చేసిన చెరుకుల సంబంధించి బకాయిలు ఇంకా రాలేదని, తాము తీవ్ర ఇబ్బందిలు పడుతున్నామని ఈ సమస్యకు పరిష్కారం చెప్పాలని కోరారు. అలాగే తాము పని చేసుకోవడానికి సరైన పని ఇక్కడ దొరకడం లేదని ప్రభుత్వం నుంచి ఈ ప్రాంతంలో మహిళలకు యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించే పరిశ్రమలను నెలకొల్పే విధంగా కృషి చేయాలని రాజును కోరారు. జన్నవరం గ్రామంలో ఆవ కాలువ వద్ద ఉపాధి హామీ పథకంలో పనులు చేపడితే వ్యవసాయానికి ఉపయోగంగా ఉంటుందని అన్నారు. జన్నవరం, కొత్తూరు గ్రామాల్లో మంచి నీటి కొరకు తీవ్ర



ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అలాగే శ్రీరామపట్నం గ్రామంలో 500 మీటర్ల పైబడి సీసీ రోడ్డు ఒక కిలోమీటర్ పైబడి కరెంట్ సదుపాయం కల్పిస్తే వ్యవసాయానికి అత్యంత సానుకూల వాతావరణం కలుగుతుందని అన్నారు.ఈ సమస్యలపై స్పందించిన రాజు మాట్లాడుతూ అతి త్వరలోనే చక్కెర బకాయిలు చెల్లించడానికి ప్రభుత్వం నుండి నిధులు తేవడానికి కృషి చేస్తున్నామని అలాగే తన దృష్టి తీసుకువచ్చిన ఈ సమస్యలు అన్నింటిని అధికారులు దృష్టికి వెళ్లి కచ్చితంగా పరిష్కరిస్తామని అన్నారు. తొందరలోనే జన్నవరం గ్రామ సందర్శనలో ప్రతీ కుటుంబాన్ని కలసి అన్ని విషయాలు తెలుసుకుంటానని అన్నారు.తదుపరి ప్రమాదవశాత్తు గాయపడిన చోడవరం పట్టణ అధ్యక్షులు కర్రి రమేష్ ని , గవరవరానికి చెందిన డి రామకృష్ణను రాజు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో చోడవరం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అల్లం రామ అప్పారావు , చోడవరం నియోజవర్గ వీర మహిళా అధ్యక్షురాలు నందవరపు రమాదేవి నాయుడు, వినాయక గుడి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మంగ శ్రీనివాసరావు, చోడవరం పట్టణ మహిళా అధ్యక్షురాలు నరవ సరోజిని పార్టీ నాయకులు పోతల అప్పారావు, సాలపు శ్రీను , సాలపు నరసింహమూర్తి, పోలేపల్లి శ్రీనివాసరావు నేమని సింహాచలం పచ్చికూర గోవిందరావు, కోశం నర్సింగ రావు, గండ్రేడ్డి గంగాధర్, కొప్పు సన్యాసి నాయుడు, మజ్జి సంతోష్ కుమార్, శ్రీ ఉగ్గిన ప్రసాద్, జెర్రిపోతుల శ్రీనివాస రావు, లగిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు



## ప్రజాసేవలో ఆదిరెడ్డి: వార్డుల్లో పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశం!

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూన్ 26**

:ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చేపట్టిన 'మన వార్డులో... మన ఆదిరెడ్డి' కార్యక్రమం 6, 31వ డివిజన్ల పరిధిలోని అన్నపూర్ణమ్మపేటలో గురువారం రాత్రి నుండి శుక్రవారం వరకు కొనసాగింది. పార్టీ సీనియర్ కార్యకర్త నాలిపల్లి అప్పారావు నివాసంలో రాత్రి బస చేసిన ఎమ్మెల్యే, ఉదయం నుండి స్థానిక కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ పర్యటించారు. డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, మంచినీటి సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. 6, 31వ డివిజన్లు (అన్నపూర్ణమ్మపేట).డ్రైనేజీ నిర్వహణ, సిసిరోడ్లు, వీధి దీపాలు, తాగునీరు, పెన్షన్లు, రేషన్ కార్డులు, ప్రభుత్వ గృహాలు. ప్రజలకు అందుబాటులో ఉ ంటూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయడం, మౌలిక వసతుల కల్పన.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు), రాజమహేంద్రవరం జనసేన సిటీ ఇన్చార్జ్ అను శ్రీ సత్యనారాయణ,పార్టీ సీనియర్ కార్యకర్త నాలిపల్లి అప్పారావు, కూటమి నాయకులు, స్థానిక పార్టీ కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలు పరిష్కరిస్తా...!

**- అందుకే ప్రతి శుక్రవారం పీజీఆరఎస్**

**- ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్**

**విశాఖపట్నం, జూన్ 26, జయ జయహే**

ప్రతి శుక్రవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలకు పరిష్కారానికి కృషి చేస్తానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. మిథిలాపురి లే అవుట్ లో బస్టాప్ స్థలం సహా ఓపెన్ స్పేస్ వీఎంఆర్డీఏ వేలం పాటలో అమ్మడాన్ని వ్యతిరేకిస్తూ లేఅవుట్ ప్రజలు ఎమ్మెల్యేను కలిశారు. నగరంపాలెం నుంచి మల్లయ్యపాలెం వరకు ప్రతిపాదించిన 80 అడుగుల రోడ్డు విస్తీర్ణాన్ని 60 అడుగులకు తగ్గించారని, ఇక్కడ నలుగురికి పెండింగ్ లో ఉన్న టీడీఆర్ లు ఇవ్వాలని బాధితులు కోరారు. వాంబే కాలనీలో కొన్ని టీడీఆర్ లు పెండింగ్ లో ఉన్నాయన్నారు. తాత ఆస్తిలో తోబుట్టువులు తన వాటా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని పెదగదిలికి చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. 1 వ వార్డులో రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఆ వార్డులో సమస్యల గురించి విన్నవించిన స్థానికులకు గంటా తెలియజేశారు. సింహాచలం బీఆర్టీఎస్ రోడ్డు విస్తరణలో తమ స్థలాన్ని తీసుకున్న జీవీఎంసీ దాన్ని రోడ్డుగా చెబుతూ టీడీఆర్ నిరాకరిస్తోందని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని సింహాచలానికి చెందిన లోగిశ అనిల్ కుమార్ వినతి పత్రం అందజేశారు. తగరపువలస అంబేద్కర్ విగ్రహం చుట్టూ కడుతున్న బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించాలని భీమిలికి చెందిన దండి వెంకటేష్ కోరారు. ఆర్టీసీ బస్సులు తగరపువలస నుంచి హైవేకి వెళ్లే అవకాశం పరిశీలించాలని ఆ ప్రాంత వాసులు విజ్ఞప్తి చేశారు. శిధిలావస్థలోని పొట్నూరు మంచినీటి ట్యాంకు బాగు చేయాలని ఆ గ్రామానికి చెందిన రాము కోరారు.

## ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి వేడుకలు

**గాజువాక (జయ జయహే)**




బహుజన సమాజ్ పార్టీ నియోజవర్గం ఇన్చార్జి నంది కోళ్ల అప్పారావు ఆధ్వర్యంలో.ఛత్రపతి సాహూ మహారాజ్ 153.జయంతి సందర్భంగా. దువ్వాడ బ్రిడ్జ్ అంబేద్కర్ సెంటర్ దగ్గర వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహరాష్ట్రలోని కొల్హాపూర్ సంస్థానానికి చెందిన గొప్ప సంఘ సంస్కర్త, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి. ఆయన విద్య, మహిళా సాధికారత, అంటరానితనం నిర్మూలనకు విశేష కృషి చేశారని తెలిపారు ఈ కార్యక్రమానికి విశాఖ జిల్లా అధ్యక్షులు సవరాలు రమేష్ విశాఖ జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ సుభాన్ గాజువాక నియోజవర్గం ఇన్చార్జి నంది కోళ్ల అప్పారావు గాజువాక నియోజవర్గం అధ్యక్షులు చోడవరపు శంకర్ గాజువాక నియోజవర్గం మహిళా కన్వీనర్.. సత్యవతి గాజువాక నియోజవర్గం సెక్రెటరీ.కి. అన్నవరం పట్నాయక్. జొన్నకోట విజయకుమార్ పట్నాల్ రాజు. .రవి. దువ్వాడ రమేష్ మరియ-ువెంకటేష్ ప్రసాద్ . ముత్యాలరావు సోంబాబు, తదితరులు పాల్గొన్నారు



## వర్షాకాలంలో
# బెస్ట్ డ్రింక్స్

వర్షాకాలంలో చల్లటి వాతావరణం ఆహ్లాదకరంగా ఉన్నా పలు ఇన్ఫెక్షన్లు దాడి చేసే ముప్పు పొంచి ఉంటుంది. వర్షాలతో నీరు నిలిచే పరిస్థితి ఏర్పడటం ద్వారా దోమల వ్యాప్తితో పలు రకాల వైరస్‌లు, ఇన్ఫెక్షన్ల ముప్పు ఎదురవుతుంది. వర్షాకాలంలో వైరస్‌లు, ఇన్ఫెక్షన్ల బారినపడకుండా రోగనిరోధక శక్తి పెంచే పానీయాలు, ఆహార పదార్థాలు తీసుకోవాలని వైద్యులు చెబుతుంటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆరోగ్యకర ఆహారం కీలకమని వైద్యులు సూచిస్తుంటారు. ఇక ఈ సీజన్‌లో మన ఇంట్లో లభించే పదార్థాలతోనే ఇమ్యూనిటీని మెరుగుపరుచుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా అందరి ఇండ్లలో కిచెన్‌లో దొరికే దాల్చిన చెక్క ఈ సీజన్‌లో వ్యాధి నిరోధక శక్తి పెంచేందుకు దివ్యౌషధంలా పనిచేస్తుంది. దాల్చిన చెక్క, అల్లం టీ మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుస్తుంది. దాల్చిన చెక్క, అల్లం రెండింటిలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటంతో వర్షాకాలంలో ఇమ్యూనిటీని బలోపేతం చేస్తుంది. ఈ టీని రోజూ తీసుకోవడం ద్వారా మనలో రోగనిరోధక వ్యవస్థ మెరుగవుతుందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఇక దాల్చిన చెక్క, థైమ్ టీ వర్షాకాలంలో సిప్ చేసేందుకు మేలైన ప్రత్యామ్నాయం. ఈ టీ తీసుకోవడం ద్వారా గొంతు నొప్పి మటుమాయం కావడంతో పాటు హానికారక ఇన్ఫెక్షన్స్‌ను దీటుగా ఎదుర్కొంటుంది. ఈ టీ తీసుకుంటే జలుబు, దగ్గును కూడా నివారించవచ్చు. ఇక వర్షాకాలంలో దాల్చినచెక్కతో చేసిన ఈ పానీయాలను ట్రై చేయండి..

దాల్చిన చెక్క, అల్లం టీ
దాల్చిన చెక్క గ్రీన్ టీ
దాల్చిన చెక్క పాలు
దాల్చిన చెక్క, హనీ వాటర్
దాల్చిన చెక్క, థైమ్ టీ

# హ్యాంగోవర్‌తో తల పగిలిపోతోందా?

## ఈజీగా తగ్గించే ఆహారాలు




**లేట్‌నైట్ పార్టీలు, మందు, విందులతో ఎంజాయ్ చేసేవారు.. ఆ మర్నాడు హ్యాంగోవర్‌తో ఇబ్బంది పడుతుంటారు. అయితే, ఆల్కహాల్ తాగిన అందరికీ ఈ సమస్య రాదు. వచ్చినా ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధంగా ఉంటుంది. హ్యాంగోవర్ అనేది ఎవరిలో ఏ స్థాయిలో ఇబ్బంది పడుతుంది అనేది దాని తీవ్రత మీద ఆధారపడి ఉంటుంది.. అయితే, హ్యాంగోవర్‌ను తగ్గించుకునేందుకు ఏం చేయాలంతో తెలియక చాలా మంది ఇబ్బంది పడుతుంటారు. దీనిని సహజంగా తగ్గించుకోవడానికి ఇంట్లో కొన్ని చిట్కాలను ఫాలో అవ్వొచ్చు అంటున్నారు నిపుణులు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం..**

హ్యాంగోవర్‌ని తగ్గించడంలో తేనె బాగా హెల్ప్ చేస్తుంది. తేనెతేనెలో జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా మార్చే పోషకాలు అధికంగా ఉంటాయి. తేనెను తీసుకోవడంతో శరీరంలో ఆల్కాహాల్ తాగడంతో జరిగిన ఎఫెక్ట్స్ తగ్గుతాయి. వివిధ పదార్థాల్లో తేనె కలుపుకొని తీసుకుంటే మంచిది. అలాగే, కొబ్బరి నీళ్లు కూడా ఎంతగానో ఉపయోగపడతాయి. కొబ్బరి నీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్ రిచ్ ఫ్లూయిడ్స్ హ్యాంగోవర్‌ను తగ్గిస్తాయి. శరీరంలో తగ్గిపోయిన న్యూట్రిషన్స్‌ను తిరిగి అందిస్తాయి. హ్యాంగోవర్ సమయంలో డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి. కాబట్టి తరచూ నీళ్లు తాగుతూ ఉండటం మంచిది. హైడ్రేటెడ్‌గా ఉండడం వల్ల హ్యాంగోవర్ తగ్గుతుంది.. శరీరం నుంచి టాక్సిన్లు బయటకి పోతాయి. ఈ సమయంలో కూల్ డ్రింక్స్ తీసుకుంటే పరిస్థితి విషమిస్తుంది. కొబ్బరి నీరు వంటి ఎలక్ట్రోలైట్ అధికంగా ఉండే పానీయాలు హైడ్రేటెడ్‌గా ఉండడంలో హెల్ప్ చేస్తాయి. అలాగే,

నిమ్మకాయ.. నిమ్మకాయ అనేది హ్యాంగోవర్‌ను సులభంగా తగ్గిస్తుంది. నిమ్మలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. నిమ్మ టీ తాగడం లేదా నిమ్మరసం తాగడంతో హ్యాంగోవర్ తగ్గుతుంది. అరటి పండు కూడా హ్యాంగోవర్‌లో ఉపయోగపడుతుంది. అరటిలో పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యాన్ని అందిస్తాయి. అరటి తింటే మైకము, అలసట తగ్గుతుంది. హ్యాంగోవర్‌కు మజ్జిగ కూడా మంచి మందులా పనిచేస్తుంది. మజ్జిగలో పోషకాలు అధికంగా ఉంటాయి. మజ్జిగ తాగితే హ్యాంగోవర్ తగ్గుతుంది. ఆల్కాహాల్ తాగితే శరీరం డీ హైడ్రేట్ అవుతుంది. మజ్జిగ తాగితే హైడ్రేట్‌గా ఉంచుతుంది.

హ్యాంగోవర్‌తో ఇబ్బంది పడుతున్నప్పుడు పుదీనా వాడకం కూడా మేలు చేస్తుంది. పుదీనా కడుపును శుభ్రం చేయడంలో సహాయపడుతుంది. పుదీనాను వివిధ రూపాల్లో తీసుకుంటే కడుపులోని అదరపు గ్యాస్ తొలగుతుంది. అలాగే, హ్యాంగోవర్ సమయంలో గుడ్లు తినడం కూడా మంచిది. గుడ్లలో ప్రోటీన్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. గుడ్లలోని ప్రోటీన్లు టాక్సిన్లను తొలగిస్తాయి. హ్యాంగోవర్‌ను కంట్రోల్ చేస్తాయి.

# వింటేజ్ సొగసు







**అతివల అలంకరణలో ఎన్ని ఎక్కువ ఆభరణాలు ఉంటే అంత అందం. ఎప్పటికప్పుడు సరికొత్త డిజైన్లతో వినూత్నమైన నగలను వేసుకుని మురిసిపోతుంటారు. ఈ ట్రెండ్‌ను గమనించిన డిజైనర్లు మగువల మనసు దోచేలా కొత్తకొత్త డిజైన్లు ఆవిష్కరిస్తున్నారు.**

అతివల అలంకరణలో ఎన్ని ఎక్కువ ఆభరణాలు ఉంటే అంత అందం. ఎప్పటికప్పుడు సరికొత్త డిజైన్లతో వినూత్నమైన నగలను వేసుకుని మురిసిపోతుంటారు. ఈ ట్రెండ్‌ను గమనించిన డిజైనర్లు మగువల మనసు దోచేలా కొత్తకొత్త డిజైన్లు ఆవిష్కరిస్తున్నారు. అలా ట్రెండ్ ఫాలో అవుతూ మార్కెట్‌లోకి వచ్చిందే వింటేజ్ జువెలరీ.

ఆధునిక సొబగులు అద్దుకున్న వింటేజ్ నగలపై ఈ తరం మహిళలు మోజుపడుతున్నారు. సంప్రదాయ వేడుకలు, పండగల్లో చీరకట్టులో కనికట్టు చేసే సుందరీమణుల మెడల్లో ఇవి ఎంచక్కా ఒదిగిపోతున్నాయి. కాలం మారినా 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' అని మురిపిస్తున్న వింటేజ్ జువెలరీ విశేషాలివి..

అమ్మమ్మ కాసుల పేరు, నానమ్మ కంటె, కడియాలు.. ఇలా పలురకాల నగలు వారసత్వంగా మనవరాళ్ల నగలపెట్టెలో అడుగునపడి ఉంటాయి. ఇవేకాదు.. గుండ్ల హారాలు, ఎనల గొలుసులు, ముంజేతి కడియాలు, జడ చుక్కలు.. ఇలా చాలా రకాల ఆభరణాలు తాతమ్మ తరంలో ఫ్యాషన్. కాలక్రమంలో కరిగిపోయిన ఈ నగలు మరోసారి పురుడు పోసుకుంటున్నాయి. ముఖ్యంగా చంద్రహారాలు, సూర్యహారాలు, అష్టలక్ష్మి గొలుసులు, కమ్మలు-బుట్టాలు, వంకీలు, రవ్వల గాజులు, ఒడ్డాణాలు ఇలా ఆ పాతకాలం మెరుపులన్నీ ఈ తరానికి చేరువ అవుతున్నాయి. వీటికి యాంటిక్ జువెలరీగా పేరు పెట్టి అతివలు ప్రత్యేకంగా ఆదరిస్తున్నారు. ఎలిగెంట్ లుక్‌తో అలరిస్తున్న ఈ నగలు ధరిస్తే పండుగ సందడి రెండింతలు కావడం ఖాయం.

# దేశ ఔన్నత్యం చాటి చెప్పడమే 'గజల్ యువ భారతీయం'







- గిన్నిస్ ప్రపంచ రికార్డుల గ్రహీత లెజెండ్రీ డాక్టర్ గజల్ శ్రీనివాస్
- చివరి రోజు భారీగా హాజరైన విద్యార్థులు
- దేశభక్తిని, ప్రకృతి గొప్పతనాన్ని చాటి చెప్పిన జెన్ జీ గజల్స్ గేయాలు
- ఘనంగా ముగిసిన మూడు రోజుల గజల్ యువ భారతీయం

**విశాఖపట్నం, జూన్ 26, జయ జయహే :**

దేశానికి సేవలందించేందుకు యువతరం ఎప్పుడు ముందుండాలన్న తపనతోనే గజల్ యువ భారతీయం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, గజల్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గజల్ యువ భారతీయం ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా కళాభారతి అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి డాక్టర్ జి ఆర్ కే ప్రసాద్ (రాంబాబు) , కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్, లోక్ సత్తా పార్టీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి హాజరై జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ లేనటువంటి స్వేచ్ఛ, స్వాతంత్రాలు భారతదేశంలో ఉన్నాయని అటువంటి దేశానికి సేవ చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ప్రకృతి, భారతదేశం గొప్పతనాన్ని గేయాల్లో ఆవేశం, బాధ్యత గుర్తు చేస్తూ గానం చేస్తున్న సమయంలో విద్యార్థులంతా తన్మయత్వం చెందారు. నేల, నీరు, గాలి, నిప్పు, నింగి పంచభూతాలు మనుషులు జీవించేంతకాలం మనకు రక్షణగా ఉంటాయని మనం లేకపోయినా తరతరాలకు వాటి అవసరం ఉంటుందని ఈ నేపథ్యంలో మనందరం కూడా వాటిని కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని చెప్పారు. భారత దేశ స్వాతంత్రం కోసం ఎందరో ప్రాణ త్యాగం తృణప్రాయంగా వదిలేశారని గుర్తు చేశారు. నేటి యువత వారి గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత చాలా ఉందన్నారు. కళాభారతి అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి డాక్టర్ జి ఆర్ కే ప్రసాద్ రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మూడు రోజులపాటు కళాభారతిలో విద్యార్థుల కోసం గజల్ శ్రీనివాస్ చేపట్టిన మహత్తర కార్యక్రమం దేశభక్తిని పెంపొందించిందన్నారు. గజల్ శ్రీనివాస్ వంటి కార్యక్రమానికి రావాలంటే ఎంతో ఖర్చుతో కూడుకునేదని అయితే ఆయన మాత్రం ఎటువంటి లాభపేక్షా లేకుండా విద్యార్థుల కోసం ఉచితంగానే కార్యక్రమాన్ని చేపట్టడం గొప్ప విషయం అన్నారు. తండ్రి గొప్పతనాన్ని వివరిస్తూ పాడిన గేయం..(నాన్న... రాత్రులు ఉదయించే సూర్యుడే నాన్న) గానం చేస్తున్నప్పుడు విద్యార్థులంతా చప్పట్లు విజిల్స్‌తో కళాభారతి ఆడిటోరియం హోరెత్తింది. చివరగా జాతీయ గీతాన్ని ఆలపించి మూడు రోజుల గజల్ యువ భారతీయం కార్యక్రమానికి వందన సమర్పణ చేశారు.








## కిమ్స్‌లో తొలి స్పోర్ట్స్ ఆర్థోపెడిక్ క్లినిక్

### ప్రారంభించిన సీపీ డా. శంఖ బత్ర బాగ్చి.

**విశాఖపట్నం, జూన్ 26, జయ జయహే :**

క్రీడా కారులకు అయ్యే గాయాలను చికిత్స చేసేందుకు సీతమ్మధార కిమ్స్ ఆసుపత్రిలో క్రొత్తగా నెలకొల్పిన స్పోర్ట్స్ ఆర్థోపెడిక్ క్లినిక్ చాలా ఉపయోగకరమని విశాఖ నగర పోలీసు కమిషనర్ శంఖ బ్రత బాగ్చి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఈ ఆసుపత్రిలో నెలకొల్పిన స్పోర్ట్స్ ఆర్థోపెడిక్ క్లినిక్ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటలు ఆడేవారు గాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆటలు, ఇతర సాధన సమయాల్లో అయ్యే గాయాలపై వారి భవిష్యత్తు తీవ్ర ప్రభావం చూపుతా యన్నారు. ఇటీవలి కాలంలో విశాఖపట్నంలో క్రీడలు, ఫిట్‌నెస్ కార్యకలాపాలపై ఆసక్తి పెరిగిందన్నారు. యువత ఎక్కువగా ఆటలు, ఫిట్ నెస్ ల కోసం ఎక్కువ సమయాన్ని వెచ్చిచడాన్ని మనం చూస్తున్నా మన్నారు. అనుకోకుండా తగిలిన గాయాల కోసం అత్యాధునిక సాంకేతికతో కూడా అన్ని రకాల సేవలు ఇప్పుడు కిమ్స్ హాస్పిటల్స్ ఒకచోట లభించడం ఈ క్లినిక్ ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. అనంతరం ఆసుపత్రి కన్సల్టెంట్ స్పోర్ట్స్ ఆర్థోపెడిక్ సర్జన్, ఆర్థోస్కోపిక్ స్పెషలిస్ట్ డా. శ్రీనివాస్ గొల్లంగి మాట్లాడుతూ సంప్రదాయ క్రీడలతో పాటు బాక్స్ క్రికెట్, బ్యాడ్మింటన్, ట్రెక్కింగ్, హైకింగ్, రన్నింగ్, మారథాన్, సైక్లింగ్ మరియు జిమ్ వ్యాయామాలు వంటి వాటిలో యువతతో పాటు మధ్యవయస్కులు కూడా ఎక్కువగా పాల్గొంటున్నా రన్నారు. దీంతో మోకాళ్లు, భుజాలు, కండరాలు, లిగమెంట్లకు సంబంధించిన గాయాలు పెరుగుతున్నాయని వివరించారు. ఆర్థోస్కోపిక్ సేవల ద్వారా కెమెరాతో 360 డిగ్రీలతో గాయాలు ఎక్కడ తగిలాయనేది తేలికగా చూడగలుగుతున్నామని తెలిపారు. దీంతో సర్జరీ చేయడం, రోగి త్వరగా కోలుకోవడం వంటి చక, చక జరిగిపోతున్నాయని అన్నారు. కిమ్స్ హాస్పిటల్స్ సీతమ్మధార రీజినల్ సీఈఓ డా.నగేష్ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా కిమ్స్ హాస్పిటల్స్ సీతమ్మధారలో ఇప్పటికే పలు మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్నామని, ఇప్పుడు స్పోర్ట్స్ ఆర్థోపెడిక్ క్లినిక్‌తో క్రీడాకారులు, ఫిట్‌నెస్ ప్రేమికులకు మరింత మెరుగైన వైద్య సహాయం లభించనుందని ఆయన తెలిపారు. క్రీడా గాయాల బాధితులకు ఈ క్లినిక్ కొత్త ఆశగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్స్ ఆర్థోపెడిక్ విభాగం వైద్యులు డా. రాజేష్ కుమార్ రెడ్డి, డా. సంతోష్ రామ్, డా. రామరాజు, డా. వసంత బాబు, డా. అశీష్ కుమార్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.




## మాడుగులలో "నషా ముక్త్ భారత్ సప్తాహ్" ర్యాలీ

**మాడుగుల జూన్ 26 జయ జయహే**

మత్తు రహిత సమాజం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని స్థానిక ఎస్సై జి నారాయణరావు విజ్ఞప్తి చేశారు. నషా ముక్తభారత్ సప్తాహ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం మాడుగుల లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మహిళలతో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఆవరణలో మనవహారశీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్ధాలపై ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్యంగా యువతీ యువకులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని వాటి వల్ల అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం:

### ఎమ్మెల్యే రాజు

**చోడవరం,జూన్ 26 జయ జయహే**

ప్రజల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నమని శాసనసభ్యులు కే ఎస్ ఎన్ ఎస్ రాజు చెప్పారు. శుక్రవారం చోడవరం పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు నిర్వహించిన గ్రీవెన్స్ లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ ఆర్ గురించి ప్రతి బిఎల్ఎ మై టిడిపి ఆప్ లో అప్లోడ్ చేయాలని వివరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక అభివృద్ధి సంబంధిత సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే అర్హులైన లబ్ధిదారులకు వృద్ధాప్య, వికలాంగుల పింఛన్లు మంజూరు చేయాలని, వికలాంగులకు ట్రైసైకిళ్లు అందించాలని, గోదావరి నది ఒడ్డున క్రైస్తవులు రక్షణ బాప్తీస్మం పొందుటకు స్థలాన్ని కేటాయించాలని, త్రాగునీటి కుళాయి కనెక్షన్లు మంజూరు చేయాలని కోరారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తన ధ్యేయమన్నారు.



## జాయింట్ కలెక్టర్‌కు గుగ్గుడు గ్రామానికి రావాలని ఆహ్వానం

**అరకులోయ: జయ జయహే.**

అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ ను ఆదివాసీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు చట్టు మోహన్ శుక్రవారం పాడేరు జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, మొక్కను అందజేసి తన స్వగ్రామమైన గుగ్గుడు గ్రామాన్ని సందర్శించాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా బస్కి పంచాయితీ గుగ్గుడు గ్రామంలో ఉన్న అంగన్వాడి భవన సమస్యను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన చట్టు మోహన్, భవన నిర్మాణం కోసం స్థానిక కుటుంబం స్థలాన్ని ఇచ్చినప్పటికీ వారికి ఇప్పటివరకు న్యాయం జరగలేదని వివరించారు. ఆ కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా గ్రామంలో రహదారి, తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, అంగన్వాడి స్థల సమస్యను పరిశీలించి సంబంధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఉన్న రహదారి, తాగునీటి సమస్యలను కూడా సంబంధిత అధికారులతో సమీక్షించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

# పేదలకు భూ పంపిణీ, రిజర్వేషన్ల పరిరక్షణకై జూలై 2న దళిత విముక్తి ర్యాలీ

**చోడవరం జూన్ 26 జయ జయహే**

రాష్ట్రంలోని భూమిలేని పేదలకు, దళితులకు భూ పంపిణీ చేయాలనీ,రిజర్వేషన్లను పరిరక్షించాలనీ దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ డిమాండ్ చేశారు. చోడవరంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిమాండ్ల సాధనకై జూలై 2న విశాఖపట్నం లో ర్యాలీ, బహిరంగ సభలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆరోజు డాబా గార్డెన్స్ ఎల్ఐసి అంబేడ్కర్ విగ్రహం నుండి ర్యాలీ ప్రారంభమై గాంధీ విగ్రహం వరకు కొనసాగుతుందనీ , అనంతరం బహిరంగ సభ జరుగు తుందని తెలిపారు. ఈ సభలో దళిత, ప్రజా సంఘాల నేతలు ప్రసంగిస్తారన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమం పోస్టర్ ,ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి దళిత, బహుజన, పేదలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికీ రాష్ట్రంలో వేలాది ఎకరాల భూములు చట్ట విరుద్ధంగా భూస్వాముల చేతుల్లో ఉన్నాయని తెలిపారు. దళిత ,బహుజన ,పేదలకు పంచిన వేలాది ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని పేర్కొన్నారు. మిగులు భూములు పేదలకు పంచాల్సింది పోయి ఆ భూములతో పాటు రైతుల దగ్గర బలవంతంగా భూములు లాక్కొని కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వం అప్పగిస్తుందని మండిపడ్డారు. సాగు భూమిలేని దళిత పేదలకు మూడు ఎకరాలు చొప్పున పంపిణీ చేస్తామని



ప్రభుత్వాలు జీవో విడుదల చేసినప్పటికీ మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలు ,పరిశ్రమలను మరింత బలోపేతం చేయడానికి బదులు వాటిని ప్రైవేటీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లకు పాతర వేస్తుందని మండిపడ్డారు. రాజ్యాంగ హక్కుగా ఉన్న రిజర్వేషన్లను ఉల్లంఘించటం దారుణమని ప్రైవేటీకరణ నిలిపివేయడం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత విముక్తి ప్రతినిధులు బి .సన్యాసమ్మ, ఎన్ . వరలక్ష్మి, బోనెల అప్పారావు, అనకాపల్లి జిల్లా దళిత నాయకులు కంకణాల శ్రీను,రాము చోడవరం ద్వారక నగర్ సంక్షేమ సేవా సంఘం నాయకులు, ఎస్.కె హుస్సేన్, చిన్నారావు అప్పయ్యమ్మ, బోడయ్య, యస్ కె హిమామ్, షేక్ మదీనా, పేరమ్మ, జ్యోతి, జైన తదితరులు పాల్గొన్నారు.



## మత్తు రహిత సమాజ స్థాపనే మన లక్ష్యం

### చోడవరంలో "నషా ముక్త్ భారత్ సప్తాహ్" వారోత్సవాలు

**చోడవరం జూన్ 26 జయ జయహే**

మత్తు రహిత సమాజం స్థాపన లక్ష్యంగా పోలీస్ శాఖ ముందుకు వెళ్తుందని చోడవరం సిఐ పి అప్పలరాజు అన్నారు. నషా ముక్తభారత్ సప్తాహ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం చోడవరం లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటో డ్రైవర్లు మహిళలతో ర్యాలీ నిర్వహించి కొత్తూరు జంక్షన్ లో మనవహారశీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలు కొత్త రకంగా ప్రతిజ్ఞ చేయించారు. సీఐ మాట్లాడుతూ ముఖ్యంగా యువకులు ఈ మత్తు పదార్థాలు బారిన పడి అనేక ఇబ్బందులకు గురవుతున్నారని జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నవభారత నిర్మాణంలో భాగంగా మత్తు పదార్థాల రహిత సమాజాన్ని స్థాపించడమే మన అందరి ప్రథమ కర్తవ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com